సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 12-12-2025 ₹15/-




## ఆర్థికం





ఉత్తమ బోధకుని లక్షణాలు

గీటురాయి వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in
Our Bank A/c Details:
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 48 హైదరాబాద్
శుక్రవారం 12 డిసెంబర్ 2025 రూ.15-00
జమాది ఉల్ ఆఖిర్ 20 1447 హి|జ్రీ

**తొలిగీటు**

ప్రళయ దినాన
దుష్ట వ్యాపారులు
దురాచారుల స్థలిలో
నిలబెట్టబడతారు

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**



కథ 28

**మంచి పొరుగు**

## లోపల...

| | | |
|---|---|---|
| పశ్చిమాసియా | ...... | 04 |
| ఆర్థికం | ...... | 05 |
| హక్కుల ఉల్లంఘన మానవతకు వ్యతిరేకం | ...... | 08 |
| ఇరుగు పొరుగు పరస్పర సహకారంతో సత్సమాజ నిర్మాణం | ...... | 12 |
| గతంలోకి ఒక చూపు – 6 | ...... | 14 |
| ఇస్లామ్‌లో మానవ హక్కుల రక్షణ | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| కత్తి వేలాడుతోంది! | ...... | 20 |
| యువతా మేలుకో! | ...... | 22 |
| విజయంలో వినయం ఓటమిలో సహనం | ...... | 24 |
| నేల మార్గదర్శకత్వం.... | ...... | 27 |
| ఉత్తమ బోధకుని లక్షణాలు | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| దాతృగుణం కన్నా ఉత్తమమైనది త్యాగభావం | ...... | 34 |

**ఈ స్టేటుకు నేనే సీఎంనీ...!**



(మరో పదేళ్ళు నేనే సీఎం – రేవంత్ )

ఇంకా పదేళ్ళ వరకు
తనదేనట అధికారం
రెండేళ్ళలోనే ఇంతగా
పెరిగింది మమకారం!

కుర్చీపై ఎవరూ ఇక
వెయ్యొద్దట కన్ను
సాహసిస్తే ఎవరైనా
విరుగుద్దట మిన్ను!!

*– యం.డి. ఉస్మాన్ ఖాన్*

# ఆలోచన

# పశ్చిమాసియా

**నెతన్యాహు పదవికి గండం వచ్చిందా?** ఆయన పదవి నుంచి తప్పుకోవడం తప్పదా?

ఇస్రాయిల్ అధ్యక్షుడికి ఇస్రాయిల్ ప్రధానిగా నెతన్యాహు ఒక లేఖ రాశాడు. అది 111 పేజీల సుదీర్ఘ లేఖ. క్లుప్తంగా చెప్పిం దేమిటంటే, తనపై నడుస్తున్న కేసులో తనను క్షమించాలని కోరుకున్నాడు. అంటే తాను తప్పు చేశాడో లేదో, చేసిందేదో చేసేశాడు కాబట్టి ఇప్పుడు మన్నించి వదిలేయమంటున్నాడు. అంటే తనకు పొలిటికల్ క్లీన్ చిట్ ఇవ్వమని చెప్పడం. విచిత్ర మేమిటంటే ఆయనపై కోర్టులో కేసు ఇంకా నడుస్తోంది. తాను తప్పు చేశాడన్నది ఆయన ఒప్పుకోలేదు, అయినా తనను క్షమించాలని లేఖ రాయడమేమిటి? గతంలో ఇలా క్షమాపణ పెట్టిన సంఘటనలున్నాయి. కాని కోర్టులో కేసు పూర్తి కాకముందే, నేరం నిరూపణ కాకముందే తనను క్షమించమని కోరడం విచిత్రం. ఈ అవకాశాన్ని ప్రతిపక్షాలు వాడుకుంటూ, నెతన్యాహు రాజకీయ సన్యాసం తీసుకుంటే క్షమాపణ ఇవ్వాలని అంటున్నాయి. నెతన్యాహుపై అనేక అవినీతి కేసులున్నాయి. మరో విచిత్రమేమిటంటే, హమాస్ ఇస్రాయిల్‌పై దాడి చేసి నందుకు గాజాపై దాడి చేసి హమాస్‌ను నాశనం చేస్తానని చెప్పుకున్న ఈ నెతన్యాహుయే నిజానికి హమాస్‌కు ఆర్థికంగా డబ్బులు అందజేసేవాడన్నది ఇప్పుడు బట్టబయలయ్యింది.

ఇంకో విచిత్రమేమిటంటే, ట్రంప్ రికమెండేషనుతో నెతన్యాహు ఈ క్షమాపణ లేఖ రాశాడు. ఎందుకంటే కొంత కాలం క్రితం ఇస్రాయిల్ అధ్యక్షుడిని ఉద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ “ఇతనికి (నెతన్యాహుకు) క్షమాపణ ఎందుకు ఇవ్వరండి” అని అన్నాడు.

నెతన్యాహు చేయవలసిందంతా చేసేశాడు. ఇప్పుడు క్షమాపణ తీసుకుని ఇంట్లో కూర్చుని రెస్టు తీసుకోవాలని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. కాని రాజకీయ సన్యాసం తీసుకునే మనిషి కాదు నెతన్యాహు. ఆయనకు అధికారం ఒక మత్తు వంటిది.

ఇస్రాయిల్‌లో సంకీర్ణ ప్రభుత్వం ఉంది. నెతన్యాహు లికుడ్ పార్టీతో పాటు అత్యంత అతివాద పార్టీ నాయకుడు బెన్ గవీర్ ఉన్నాడు. ఇప్పుడు నెతన్యాహు పదవి నుంచి తప్పుకుంటే ఎన్నికలు రావచ్చు. బెన్ గవీర్ వంటి అతివాదులు అధికారానికి రావచ్చు.


ఇస్రాయిల్‌లో పరిస్థితి సాధారణంగా లేదు. స్వయంగా అధ్యక్షుడే ఈ మాటలు చెప్పాడు. అంతర్యుద్ధం వంటి పరిస్థితి ఉందంటున్నారు. నెతన్యాహు సుదీర్ఘ కాలంగా అధికారంలో ఉండడం వల్ల ఇస్రాయిల్‌లోని ప్రతి నాయకుడి గురించి అతనికి బాగా తెలుసు. అందరి బలహీనతలు తెలుసు.

మరోవైపు ఇస్రాయిల్ వరుస యుద్ధాల్లో ఉంది. గాజాలో జాతినిర్మూలనకే పాల్పడింది. లెబనాన్‌పై దాడి చేసింది. సిరియాపై దాడి చేసింది. గ్రేటర్ ఇస్రాయిల్ ప్రాజెక్టులో సిరియా, లెబనాన్‌లు కూడా ఉన్నాయి. సిరియాలో ఇస్రాయిల్ సైనిక నష్టం కూడా చాలా జరిగింది. ఇస్రాయిల్ ఆర్థిక వ్యవస్థ కూడా ఇప్పుడు యుద్ధాలపై ఆధారపడింది. ఈ పరిస్థితుల్లో నెతన్యాహు తప్పుకుంటే ఇస్రాయిల్ రాజకీయాల్లో పెను భూకంపాలు రావచ్చు. కాని నెతన్యాహు అధికారంలో కొనసాగుతూ, ఆయనకు క్షమాపణ లభించడం కూడా జరిగితే అది కూడా ఇస్రాయిల్‌లో కల్లోలానికి కారణం కావచ్చు.

వీటన్నింటి నేపథ్యంలో మరో వార్త ఏమిటంటే, డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతిపథకంలో బీటలు కనిపి స్తున్నాయి. పాలస్తీనాకు అంతర్జాతీయ శాంతిదళం పంపిస్తామని ట్రంప్ చెప్పాడు. ఎందుకంటే ఈ శాంతిదళం రూపురేఖల విషయంలో ఇస్రాయిల్ చేసిన మార్పుల తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఈజిప్టు, ఇండోనేషియా తదితర దేశాలు దీంట్లో పాల్గొనేది లేదన్నాయి. అంటే ట్రంప్ ప్రతి పాదించిన శాంతి పథకానికి నెతన్యాహు తిలోదకాలిచ్చాడు.

ఇప్పుడు నెతన్యాహు భవిష్యత్తు నిజానికి ఇస్రాయిల్ రాజకీయాల్లో పెనుమార్పులకు దారితీయడమే కాదు, మరోవైపు పాలస్తీనాతో పాటు పూర్తి పశ్చిమాసియా రాజకీయాల్లో కూడా అనేక మార్పులకు కారణం కావచ్చు.

అబ్దుల్ వాహెద్




# ఆర్థికం

**రూపాయి విలువ** ఇప్పుడు డాలరుకు 90 రూపాయలు దాటేసింది. గతంలో అంటే పదేళ్ళకు పూర్వం, మోడీ ప్రధానికాక పూర్వం, మన్మోహన్ ప్రధానిగా ఉన్నప్పుడు రూపాయి విలువ పడిపోయినప్పుడు మోడీ చేసిన విమర్శలను ఇప్పుడందరు గుర్తు చేసుకుంటున్నారు. అంతేకాదు, అప్పట్లో అమితాబ్ బచ్చన్, జూహీ చావ్లా, అనుపమ్ ఖేర్ వంటి వారు వ్యంగ్యంగా చేసిన విమర్శలను కూడా ఇప్పుడు గుర్తు చేస్తున్నారు. ఈ మహానట శేఖరులు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నిస్తున్న వారు కూడా చాలా మంది ఉన్నారు.

రూపాయి విలువ మొదటిసారి ఒక డాలరుకు 90 రూపాయలు దాటేసింది. ఇది మొదటిసారి... ఇంతకు ముందు 89 రూపాయలు దాటేసినప్పుడు కూడా మొదటిసారి 89 రూపాయలు దాటేసిందని చెప్పుకున్నారు. రూపాయి విలువను కాపాడ్డానికి రిజర్వు బ్యాంకు ఎన్ని డాలర్లు కొంటోంది? డాలరుకు వంద రూపాయలు కూడా దాటేస్తుందా? లాంటి అనేక ప్రశ్నలు ఇప్పుడు మన ముందుకు వస్తున్నాయి.

గత సంవత్సరంలో, రూపాయి డాలర్‌తో పోలిస్తే 5.6 శాతం పడిపోయి 84.7 నుండి 89.7కి చేరింది. యూరోతో పోలిస్తే (9.4 శాతం), బ్రిటిష్ పౌండ్‌తో పోలిస్తే (14.3 శాతం) పడిపోయింది. ఈ కాలంలో జపాన్ యెన్, చైనీస్ యువాన్‌లతో పోల్చినా చాలా బలహీనపడింది. రూపాయి విలువ అన్ని ప్రధాన కరెన్సీలతో పోల్చితే తగ్గిపోయింది.

విదేశీ వాణిజ్య దృక్పథం నుండి చూస్తే ఇది మంచి పరిణామం కాదన్నది అందరూ ఒప్పుకునే విషయం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ విధింపుల తర్వాత పరిస్థితులు మరింత సంక్లిష్టమయ్యాయి. ఇప్పుడు కొత్తగా ఒక వాదన వస్తోంది. తక్కువ విలువ కలిగిన కరెన్సీ ఉంటే, అది ఎగుమతులను పెంచడానికి సహాయపడుతుందని అంటున్నారు. దీనివల్ల చైనీస్ దిగుమతుల ప్రవాహం ముప్పు కూడా నివారించవచ్చనే వాదన వినిపిస్తోంది.

కాని రూపాయి విలువ పడిపోవడం వల్ల సగటు పౌరుడిపై భారం పెరగదా? పెట్రోలు విలువ పెరగదా? రోజువారి ఖర్చులు పెరగవా?

భారతదేశం దాదాపు 90 శాతం చమురు దిగుమతి చేసు కుంటుంది. ఎలక్ట్రానిక్, ఎరువులు, వంటనూనె ఇవన్నీ దిగుమతులు చేసుకోవాలి. వీటన్నింటి ఖర్చులు పెరగవా?

అలాగే విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థుల చదువుల ఖర్చులు పెరగవా? రూపాయి విలువ పడిపోవడానికి కారణాల్లో అమెరికా టారిఫ్ విధింపులు కూడా ఒకటని అంటున్నారు. అంతేకాకుండా విదేశీ పెట్టుబడిదారులు 17 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించడం కూడా దీనికి కారణం. గమనించవలసిన విషయమేమిటంటే డాలరు విలువలో మార్పు రాలేదు, కాని రూపాయి విలువ పడిపోయింది. మరోవైపు ఆర్బీఐ రూపాయి విలువ పడిపోకుండా చూసే బదులు బలహీనమైన రూపాయి ద్వారా ఎగుమతులు పెంచడానికి ప్రయత్నించి, అమెరికా టారిఫ్ చర్యలను ఎదుర్కోగలమని భావిస్తోంది. బ్లూంబర్గ్ ప్రకారం ఆసియాలో ప్రస్తుతం రూపాయి పరిస్థితి చాలా బలహీనంగా ఉంది.

అన్నిసెక్టర్లలోను చిన్న కంపెనీలు, మధ్యస్థాయి కంపెనీల షేర్ల ధరలు పడిపోయాయనే వార్త కూడా ఆ మధ్య వచ్చింది. కొన్ని కంపెనీల షేర్ల ధరలు 20 శాతం పడిపోతే, కొన్ని కంపెనీల షేర్లు 50 శాతం పడిపోయాయట. అంటే మార్కెటు నుంచి లాభాలు గతంలో పోల్చుకుంటే చాలా తగ్గిపోయాయన్నది స్పష్టం.

మన ఆర్థికవ్యవస్థ గొప్పగా పనిచేస్తుందా? ఈ ప్రశ్న ఇప్పుడు ఒకటికి పదిసార్లు అడగవలసిన ప్రశ్న.

రూపాయి విలువ పడిపోయింది, డాలరుకు 90 రూపాయలు దాటేసింది. లీటరు పెట్రోలు ధర కూడా 90 రూపాయలు దాటేసింది. కాని అంతా మన మంచికే అనే ఒక మనస్తత్వం కనిపిస్తోంది. పెట్రోలు ధర పెరిగితే పర్యావరణానికి మంచిదని, మోటారు వాహనాల వాడకం తగ్గుతుందనే సమర్థన కూడా వినబడింది. కాని అలా ఏమీ జరగలేదు. ఇప్పుడు ఢిల్లీ కాలుష్యం మనం చూస్తున్నాం. ఢిల్లీ మాత్రమే కాదు దేశంలోని చాలా నగరాల్లో కాలుష్యం పెరుగుతూనే ఉంది.

ఆసియాలోని కరెన్సీలన్నింటిలోను బలహీనమైన పరిస్థితిలో రూపాయి ఎందుకు చిక్కుకుంది? ఈ ప్రశ్నపై ఎవరైనా ఆలోచిస్తున్నారా?

2014కు ముందు రూపాయి విలువ పడిపోవడం దేశప్రతిష్ఠ పడిపోవడంగా వర్ణించినవారు ఇప్పుడు రూపాయి విలువ పడిపోయి, బలహీనంగా మారిపోవడం వల్ల లాభమే అంటూ కొత్త రాగం అందుకున్నారు. ఆర్థిక వ్యవస్థ సమస్యలన్నింటిని బలహీనపడిన రూపాయి పరిష్కరించేస్తుందా?

నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన రాజీవ్ కుమార్ ప్రకారం రూపాయి బలహీనమైతే లాభమే. దీనివల్ల ఉద్యోగాలు పెరుగుతాయంట. బలమైన కరెన్సీ అనేది పాత ఆలోచనగా కొట్టిపారేశారు. అంటే రూపాయి విలువ పడిపోతే ఇప్పుడు చింతించవలసిన అవసరం లేదు. కాని 2014కు ముందు మాత్రం చాలా చింతలో జనాన్ని ముంచేశారు. ఇప్పుడు చింతించ వద్దంటున్నారు. సరే అని చాలా మంది తలూపేస్తున్నారు.

ఇప్పుడు విదేశీ పెట్టుబడిదారులు కూడా పెట్టుబడులు ఉపసంహరిస్తున్నారు. విదేశీ పెట్టుబడిదారులు దేశంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చినప్పుడు చాలా గొప్పగా ప్రచారం చేసిన మీడియా, ఇప్పుడు విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ జరుగుతున్నప్పుడు నోరు మెదపడం లేదు.

కాంగ్రెసు నేత సుప్రియా శ్రీనేత్ ప్రకారం దాదాపు 2 లక్షల కోట్ల రూపాయల విదేశీపెట్టుబడులు ఉపసంహరణకు గురయ్యాయి. అమెరికా టారిఫ్ వల్ల ఆర్థిక వ్యవస్థపై పెనుభారం పడింది. వాణిజ్యలోటు పెరుగుతోంది. అంటే దిగుమతులు పెరుగుతున్నాయి. ఎగుమతులు తగ్గుతున్నాయి. ఇవన్నీ రూపాయి విలువ పడిపోవడానికి కారణాలు. కాని ఇప్పుడు రూపాయి విలువ పడిపోతే చింతించవద్దని అంటున్నారు. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం దిగుమతుల బిల్లు పెరగలేదా?

రూపాయి విలువ పడిపోతే దిగుమతుల బిల్లు పెరుగుతుంది. దిగుమతుల ద్వారా ఇక్కడి వినియోగదారుల వద్దకు వచ్చే ప్రతి వస్తువు ధర పెరుగుతుంది. ఉదాహరణకు పెట్రోలు, డీజీలు ధరలు పెరుగుతాయి. వీటి ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి. అంటే నిత్యావసర వస్తు ధరలు కూడా పెరుగుతాయి.

రూపాయి ధర పడిపోవడం వల్ల లాభమా? నష్టమా? సగటు పౌరుడు ఆలోచించుకోవాలిప్పుడు. ఆర్థికవేత్తలుగా చెప్పుకునే వారు ఏం చెప్పినా, రోజువారి జీవితంపై ఎంత ప్రభావం పడుతుందో ప్రతివారికి తెలిసే విషయమే.

ఒకవైపు జీడీపీ 8.2 అని వార్తలు వస్తున్నాయి. మంచి వార్త. మరోవైపు రూపాయి విలువ పడిపోయిందనే వార్త. ఇది కూడా

మంచి వార్తే అంటున్నారు నిపుణులు "కొందరు".

సరే, రూపాయి విలువ పడిపోయి ధరలు పెరిగినా, పేదరికం పెరిగినా నష్టమేముంది, ఉచితంగా ప్రభుత్వం రేషను ఇవ్వడం లేదా అని కూడా సర్ది చెప్పుకోవచ్చు. ఇప్పుడు నిరుద్యోగం కూడా పెరిగేలా ఉంది. చాలా గొప్పగా చెప్పుకున్న ఇంటర్న్‌షిప్ పథకం ఏమయ్యింది? ప్రధాని ఇంటర్న్‌షిప్ యోజన సాధించిందేమిటి? ఈ పథకాన్ని ప్రవేశపెట్టినప్పుడు చాలా గొప్పగా ప్రచారం చేశారు. ఉద్యోగాలే ఉద్యోగాలు వస్తాయని ఊదరగొట్టారు. ఐదేళ్ళలో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ ఇవ్వాలన్నది లక్ష్యంగా చెప్పుకున్నారు. కాని మొదటి సంవత్సరం ఇంటర్న్‌షిప్ ఎంతమందికి ఇచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ నేత షాయనీ ఘోష్ అడిగిన ప్రశ్నకు మంత్రి హర్ష్ మల్హోత్ర ఇచ్చిన సమాధానం ప్రకారం అక్టోబర్ 2024లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు లక్ష్యం ఏడాదికి లక్షా పాతికవేల ఇంటర్న్‌షిప్‌లు ఇవ్వడం. నవంబర్ 2025 నాటికి 2066 మంది ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు. దీని కోసం ప్రభుత్వం 73 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసింది. చెప్పిందేమిటి, ఫలితాలేమిటి? ఐదేళ్ళలో కోటి ఇంటర్న్‌షిప్‌లంటే ఏడాదికి 20 లక్షల ఇంటర్న్‌షిప్‌లు ఫలితాల్లో చూస్తే రెండు వేలకు కాస్త ఎక్కువ మంది ఇంటర్న్‌షిప్ చేశారు. ఈ పథకం చాలా గొప్పగా అమలయ్యిందని చెప్పగలమా? ఈ పథకం ప్రచారానికి దాదాపు 16 కోట్ల రూపాయలు ఖర్చయ్యాయట. అంటే ఆ సొమ్ము మీడియాకు లభించిందనే అనుకోవాలి. ఇక ఈ పథకం బాగా పనిచేస్తుందో లేదో మీడియా ఎందుకు చెబుతుంది? మరో విషయమేమిటంటే 4566 మంది ఇంటర్న్‌షిప్ మధ్యలోనే మానేశారట. అసలు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయి? కేవలం 17 కంపెనీలు 95 మందికి ఉద్యోగాలు ఇచ్చాయి. ప్రధాని ఇంటర్న్‌షిప్ పథకం ఎంత గొప్పగా పని చేస్తుందో వేరే చెప్పాలా?

బిజినెస్ లేకపోవడం వల్ల కంపెనీలు మూతపడుతున్నాయి. ఆయా కంపెనీల్లో పని చేసేవారు ఏమైపోయారు? వారి ఉద్యోగాల పరిస్థితి ఏమిటి? దేశంలో గత ఐదేళ్ళలో 2 లక్షలకు పైగా కంపెనీలు మూతపడ్డాయిని తెలుస్తోంది. ఎంత మంది నిరుద్యోగులయ్యారు?


ఈ సమస్యల గురించి మీడియా చర్చిస్తుందా? వార్తలు ప్రచురిస్తుందా?

ఆలోచించుకోవలసిన అవసరం ఉంది. మస్జిదుల క్రింద మందిరాలను కనిపెట్టడం, హిందూ లొకాలిటీలో ముస్లిం ఇల్లు కొనుక్కుంటే గగ్గోలు రేపడం, ముస్లిం విద్యార్థులు మెడికల్ కాలేజీలో సీట్లు సంపాదించుకుంటే కుట్రకోణాన్ని వెదకడం, సివిల్స్‌లో ముస్లిములు సెలక్టయితే యుపిఎస్సీ జిహాద్ అనే కొత్త పేరు కనిపెట్టడంలో నిమగ్నమై ఉన్నంత కాలం ఈ సమస్యలపై చర్చ జరుగుతుందని ఆశించడం కూడా అవివేకమే. ✤


సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# ముఖ్య ఆశయాలు

- ☛ సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ☛ ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ☛ ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ☛ ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.



# హక్కుల ఉల్లంఘన మానవతకు వ్యతిరేకం

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు గడిచిపొయ్యాయి. అయినా నేటికీ ప్రజలు న్యాయం కోసం, హక్కుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. కోట్లాది మంది ప్రజలు ఇంకా దారిద్ర్య రేఖకు దిగువనే జీవనం గడుపుతున్నారు. వీరికి హక్కులు, న్యాయం అందించాల్సిన బాధ్యత ఎవరిది? ప్రపంచంలో బలవంతులు, బలహీనులు అని రెండు రకాల వారున్నారు. గతంలోనూ ఉన్నారు. వర్తమానంలోనూ ఉన్నారు. భవిష్యత్తులోనూ ఉంటారు. సహజంగా మానవ నైజం కోరేదేమిటంటే, బలవంతుడైనవాడు తన శక్తిసామర్థ్యాలను దుర్వినియోగం చేయకూడదు. బలహీనుల పట్ల ప్రేమ, దయ, జాలి, సానుభూతి, సహకార వైఖరిని అవలంబించాలి. బలవంతుడి శక్తి, బలహీనుడి అశక్తతను దూరంచేసి, అతడి బలోపేతానికి, ఎదుగుదలకు దోహద పడాలి. కాని ఎక్కువ సందర్భాల్లో ఇలా జరగడంలేదు. బలవంతుల చేతిలోనే అనేక హక్కులు, అధికారాలు ఉండిపోతున్నాయి. బలహీనుడికి వాటిలో కొంతకూడా ప్రాప్తం కావడంలేదు. అడుగడుగునా అన్యాయం, అభద్రత, హక్కుల ఉల్లంఘనే అతనికి ఎదురవుతున్నాయి. తద్వారా హక్కులు అనుభవిస్తున్నవారు, హక్కుల నిరాకరణకు గురైనవారు వేర్వేరు వర్గాలుగా ఏర్పడ్డారు. ఒకవైపు సమస్త వనరులపై అధికారం కలిగిన బలవంతుల వర్గం, మరోవైపు దేనిపైనా ఏ అధికారమూ లేని బలహీనుల వర్గం. ప్రపంచ చరిత్రలో ఇలాంటి అసమానతా దృశ్యాలు అనేకం గోచరిస్తాయి. నిజానికి భూప్రపంచంపై నివసించే ప్రతి మానవుడికీ సహజంగానే కొన్ని హక్కులున్నాయి. మనిషి మనిషిగా జీవించడానికి ఇవి అత్యంత అవసరం. ఇందులో జాతి, కులం, మతం, భాష, ప్రాంతీయతలకు అతీతంగా మనిషిగా జీవించే హక్కు కలిగి ఉండడమే ప్రధాన ఉద్దేశ్యం. అలాంటి మానవ హక్కుల దినాన్ని1948 డిసెంబర్10న ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా డిసెంబరు 10వ తేదీని అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఏ విధమైనటువంటి వివక్షత లేని మానవ సమాజ నిర్మాణమే ఈ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ లక్ష్యం. అంటే 1948 కంటే ముందు మానవహక్కుల భావన లేదని అర్థంకాదు. అది ఐక్యరాజ్య సమితి అధికారిక ప్రకటన మాత్రమే. మానవహక్కుల్లో అన్నిటికన్నా అత్యంత ప్రాధాన్యత కలిగిన మౌలిక హక్కు జీవించే హక్కు. దీన్ని కాదనే హక్కూ

అధికారం ఎవ్వరికీలేదు. దీనిపైన్నే ఇతర హక్కులన్నీ ఆధారపడి ఉంటాయి. ఒకవేళ ఈ హక్కునే గనక భంగపరిచినట్లయితే, ఇక మరే హక్కులూ మిగలవు. భూప్రపంచంలోని సమస్త ప్రజాస్వామిక చట్టాలు దీన్ని ఒక సహజ సిద్ధమైన, ప్రకృతి సిద్ధమైన ప్రాథమిక హక్కుగా గుర్తించాయి. న్యాయశాస్త్రం, చట్టాల ప్రకారం ఏ ఒక్కరినీ ఈ హక్కుకు దూరం చేయడం సాధ్యంకాదు. మానవుడు తాను నివసించే సమాజంలో చలన రహితంగా జీవితం గడపాలని అనుకోడు. క్రియాశీలంగా, ప్రభావవంతంగా తన పాత్రను పోషించాలని కోరుకుంటాడు. ఇది అతని సహజమైన హక్కు. సమాజం ప్రగతి పథంలో పయనించాలంటే ఇది అవసరం. ప్రతివ్యక్తి తన శక్తి సామర్థ్యాలకనుగుణంగా కృషి చేసే స్వేఛ్ఛాయుత అవకాశాలున్నప్పుడే ఇదిసాధ్యం. నేటి ప్రజాస్వామ్య యుగంలో భావ ప్రకటనా స్వేచ్ఛను మానవుడి ప్రాథమిక హక్కుల్లో ఒకటిగా గుర్తించడం జరిగింది. ప్రతి వ్యక్తికీ తన భావాలను, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కూ, అధికారం ఉంటుంది. అభిప్రాయాలను ప్రకటించడానికి ఎంత స్వేఛ్ఛా, అధికారాలున్నాయో, తిరస్కరించడానికి కూడా అంతే హక్కు ఉంటుంది. అయితే ఈ భావప్రకటనా స్వేచ్ఛను హద్దులు మీరి వినియోగిస్తే సమాజానికి హానికరం. మానవుడు తన వైయక్తిక జీవితంలో స్వేచ్ఛ, హక్కు కలిగి ఉండాలన్నది అంగీకృత విషయమే. అందులో బయటి వ్యక్తుల జోక్యం ఏవిధంగానూ ఉండకూడదన్నదీ సర్వసమ్మతమే. ఇది అతని హక్కు. ఇందులో జోక్యం చేసుకునే అధికారం ఎవరికీ ఉండదు. ఈ విధంగా సమాజంలో మానవుడికి అనేక హక్కులు ప్రాప్తమై ఉన్నాయి. సాధారణంగా ప్రపంచంలో మానవ హక్కుల భావన మాగ్నా కార్టాతో ప్రారంభమైందని చెబుతారు. కాని వేయిన్నర సంవత్సరాల నాడే నాటి ఆటవిక సమాజంలో మానవ హక్కుల్ని నిర్వచించి, మానవులందరికీ హక్కులు ప్రసాదించారు ముహమ్మద్ ప్రవక్త. జాతి, వర్ణం, లింగం, కులం, మతం, భాష, ప్రాంతం, రాజకీయం... లేదా ఇతర కారణాలతో ఏవిధమైన వివక్షకు గురికాకుండా ఉండే హక్కు, భావ ప్రకటనా సేఛ్ఛహక్కు, తనకిష్టమైన మతధర్మాన్ని ఆచరించే, అనుసరించే, ప్రచారం చేసుకునే హక్కు, చిత్రహింసలు, క్రూరత్వం నుండి రక్షణ పొందే హక్కు, వెట్టిచాకిరీ, బానిసత్వం లాంటి దుర్మార్గాల నుండి రక్షణ పొందే హక్కు , సరైన కారణం, రుజువులు, సాక్ష్యాలు లేకుండా నిర్బంధించ బడకుండా ఉండేహక్కు, నేరస్తులని అనుమానమున్నప్పటికీ, నిందితులని తేలే వరకు వారు నిరపరాధులే, కేవలం అనుమానం కారణంగా దోషులుగా, నేరస్తులుగా నిర్ధారించే అధికారం ఎవ్వరికీలేదు. ఇదివారిహక్కు. ఒక అభియోగం ఆపాదించబడినప్పుడు, పక్షపాత రహితంగా విచారణ పొందే హక్కు, స్వేచ్ఛగా స్వదేశంలో గాని, విదేశాల్లో గాని పర్యటించే హక్కు, సురక్షిత ప్రాంతంలో ఏకాంతంగా జీవించే హక్కు, ఇవికాక, జీవించే హక్కు, సామాజిక భద్రతాహక్కు, భావ స్వాతంత్ర్య హక్కు, విద్యాహక్కు, పిల్లలు ఆడుకొనే హక్కు, బంధుత్వ హక్కు, ప్రజాస్వామ్య హక్కు, కాపీరైటు హక్కు, జాతీయతా హక్కు, ఏ మత ధర్మాన్నయినా స్వీకరించే, ఆచరించే,

**ప్రపంచంలో మానవ హక్కుల భావన మాగ్నా కార్టాతో ప్రారంభమైందని చెబుతారు. కాని వేయిన్నర సంవత్సరాల నాడే నాటి ఆటవిక సమాజంలో మానవ హక్కుల్ని నిర్వచించి, మానవులందరికీ హక్కులు ప్రసాదించారు ముహమ్మద్ ప్రవక్త. జాతి, వర్ణం, లింగం, కులం, మతం, భాష, ప్రాంతం, రాజకీయం... లేదా ఇతర కారణాలతో ఏవిధమైన వివక్షకు గురికాకుండా ఉండే హక్కు, భావ ప్రకటనా సేఛ్ఛహక్కు, తనకిష్టమైన మతధర్మాన్ని ఆచరించే, అనుసరించే, ప్రచారం చేసుకునే హక్కు, చిత్రహింసలు, క్రూరత్వం నుండి రక్షణ పొందే హక్కు, వెట్టిచాకిరీ, బానిసత్వం లాంటి దుర్మార్గాల నుండి రక్షణ పొందే హక్కు , సరైన కారణం, రుజువులు, సాక్ష్యాలు లేకుండా నిర్బంధించ బడకుండా ఉండేహక్కు, నేరస్తులని అనుమానమున్నప్పటికీ, నిందితులని తేలే వరకు వారు నిరపరాధులే, కేవలం అనుమానం కారణంగా దోషులుగా, నేరస్తులుగా నిర్ధారించే అధికారం ఎవ్వరికీలేదు. ఇదివారిహక్కు. ఒక అభియోగం ఆపాదించబడినప్పుడు, పక్షపాత రహితంగా విచారణ పొందే హక్కు, స్వేచ్ఛగా స్వదేశంలో గాని, విదేశాల్లో గాని పర్యటించే హక్కు, సురక్షిత ప్రాంతంలో ఏకాంతంగా జీవించే హక్కు, ఇవికాక, జీవించే హక్కు, సామాజిక భద్రతాహక్కు, భావ స్వాతంత్ర్య హక్కు, విద్యాహక్కు, పిల్లలు ఆడుకొనే హక్కు, బంధుత్వ హక్కు. ప్రజాస్వామ్య హక్కు, కాపీరైటు హక్కు, జాతీయతా హక్కు, ఏ మత ధర్మాన్నయినా స్వీకరించే, ఆచరించే, ప్రచారం చేసుకునే హక్కు. ఇలాంటి అనేక రకాల హక్కులు మానవులకు ఉన్నాయి.**

ప్రచారం చేసుకునే హక్కు. ఇలాంటి అనేక రకాల హక్కులు మానవులకు ఉన్నాయి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పుడు యావద్దేశ ప్రజలూ స్వతంత్ర భారతావనిలో తమ భవిష్యత్తు మహోజ్వలంగా ఉండగలదనీ, సకల జనులకూ ఈ సమస్త హక్కులు లభ్యం కాగలవనీ ఆశించారు. భారత రాజ్యాంగ నిర్మాణ సభ సభ్యులు కూడా ప్రజలు కలలుగన్న ఈ సుందర స్వప్నాన్ని సాకారం చెయ్యడానికి డా. బాబా సాహెబ్ అంబేద్కర్ సారథ్యంలో భారత రాజ్యాంగానికి రూపకల్పన చేశారు. భారత దేశాన్ని ఒక సంక్షేమ రాజ్యంగా తీర్చిదిద్దాలని రాజ్యాంగ ప్రదాతలు దీక్షబూనారు. ఈ బృహత్ సంకల్పంతోనే వారు భారత రాజ్యాంగ్యాన్ని ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగంగా మలిచారు. రాజ్యాంగం ఇంత పెద్ద ఉద్గ్రంథం కావడానికి ముఖ్య కారణం, ఇందులో దేశం, దేశ ప్రజల సంక్షేమానికి సంబంధించిన ఒక్కొక్క అంగాన్ని, శాఖను గురించి విపులంగా చర్చించడమే. ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా అతి ముఖ్యమైన, ప్రధానాంగాలు మూడుంటాయి. అవి: శాసన వ్యవస్థ, పాలనా వ్యవస్థ, న్యాయ వ్యవస్థ. ఈ మూడు అంగాలూ సమన్వయంతో పని చేస్తేనే ఏ దేశమైనా సంక్షేమ రాజ్యంగా ఆవిర్భవిస్తుంది. ఈ మూడు వ్యవస్థలు తమ హక్కులు, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ప్రజల హక్కులు పరిరక్షించబడతాయి. కాని దురదృష్టం ఏమిటంటే, మన దేశంలో ఈ మూడు వ్యవస్థలే ప్రజలకు ఏమాత్రం జవాబుదారీగా వ్యవహరించడంలేదు. అందుకే మానవ సమాజంలో వివక్ష, అణచివేత, అసమానత, హక్కుల ఉల్లంఘన కనబడుతున్నాయి, కొనసాగుతున్నాయి. కంచే చేను మేసిన చందంగా వ్యవస్థే పక్కదారి పడితే ఇక రక్షణ ఎక్కడ ఉంటుది? చాలా దేశాల్లో మానవ హక్కులకు పూర్తి భరోసా లేని పరిస్థితులు నేటికీ కనిపిస్తున్నాయి. మణిపూర్, పాలస్తీనాల్లో ఏం జరిగిందో, ఏం జరుగుతోందో మనం చూస్తున్నాం. రాచరిక, నియంతృత్వ పాలనలు అంతరించి, ప్రజాస్వామ్యాన్ని పూల మాలగా స్వీకరించిన భారత్‌లో సైతం మానవ హక్కుల హననం నిరంతరాయంగా కొనసాగుతోంది. యూపీ సహా అనేక రాష్ట్రాల్లో మనమీ దుర్మార్గాలను చూస్తున్నాం. యుద్ధాలతో విలవిల్లాడుతున్న దేశాల్లో, రాచరిక పాలన కొనసాగుతున్న దేశాల్లో మానవ హక్కులకు భద్రత లేదంటే ఒక అర్థముంది. కాని, ప్రజాస్వామిక దేశాల్లో కూడా మానవ హక్కుల హననం కొనసాగడం కంటే దారుణం ఇంకేముంటుంది? అతిపెద్ద ప్రజాస్వామిక దేశమని గొప్పలు చెప్పుకొంటున్న భారత్‌లో కొనసాగుతున్న మానవ హక్కుల హననంపై ఐక్యరాజ్య సమితి లాంటి అంతర్జాతీయ సంస్థలు అక్షింతలు వేసినా మన పాలకుల్లో చలనం రాకపోవడం విడ్డూరం, విషాదం. కాని భారత ప్రజలు చేయగలిగింది, తమకు అన్యాయం జరుగుతోందని, తమ హక్కులు ఉల్లంఘించబడుతున్నాయని భావించినప్పుడు, వాటికి సంబంధించిన ప్రత్యేక కోర్టులను, కమిషన్‌లను ఆశ్రయించవచ్చు. కాని ఇది అన్ని వేళలా, అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. ఏది ఏమైనా మానవుల్లో నైతిక స్పృహ జాగృతమైననాడు హక్కుల ఉల్లంఘన గురించి భయపడాల్సిన అవసరం ఉండదు. కోర్టులు, చట్టాలు తాత్కాలిక ఉపశమనమే తప్ప శాశ్వత పరిష్కారాలు కావు. పాలకుల్లో పరివర్తన, ప్రజల్లో చైతన్యం వచ్చి, నైతిక విలువలు పరిఢవిల్లిన నాడే హక్కులు పరిరక్షించబడతాయి. ✤


## చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు సర్క్యులేషన్ మేనేజర్‌కు ఫోన్ చేయండి: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

## Bank Details

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**


'చరితార్థులు'-2



# షాహ్ ముహమ్మద్ ఉమేర్

## (1903 -1978)

98





**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

అద్భుతమైన భారతీయ బహుళ సంస్కృతిని పరిరక్షించుకోవడానికి అవసరాలను అధిగమించాలని, అవకాశాలను త్యాగం చేయాలని ప్రకటించిన షాహ్ ముహమ్మద్ ఉమేర్ బిహార్ రాష్ట్రం ముంగేర్ (Munger) జిల్లాలోని జెహానాబాద్‌లో 1903లో జన్మించారు. ఆయన తండ్రి షాహ్ అష్ఫాఖ్ హుస్సేన్ సంపన్న జమీందారు. ప్రాథమిక విద్య స్వగృహంలో చేసిన షాహ్ ముహమ్మద్ ఉమేర్ గయాలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తూ, ఖిలాఫత్–సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొనేందుకు చదువుకు స్వస్తి పలికారు. ఆయన సోదరులు షాహ్ ముహమ్మద్ జుబేర్ కూడా జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు, భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం చేపట్టిన ముహమ్మద్ ఉమైర్ జాతీయోద్యమ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పని చేస్తూ స్థానిక శాఖల స్థాయి నుండి జాతీయ స్థాయి విభాగాలలో ఆయన తనదైన పాత్రను నిర్వహించారు. అభిప్రాయ వ్యక్తీకరణలో రాజీలేనితనం, ముక్కుసూటితనం వలన ఆయన స్వయంగా సమస్యల్లో చిక్కుకోవడం కాకుండా భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వాన్ని కూడా ఇరుకున పెట్టిన సందర్భాలున్నాయి. మహాత్మా గాంధీ సన్నిహిత సహచరుడిగా మెలిగిన ఆయన 1930 నాటి శాసనోల్లంఘన ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రెండు సంవత్సరాల జైలు శిక్షకు గురయ్యారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ పలు స్థానిక సంస్థలలో ప్రజాప్రతినిధిగా ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తూ ప్రజల మన్నన పొందారు. 1934లో అర్వాల్ ప్రాంతంలోని నాలుగు వందల పేద కుటుంబాల గృహాల నిర్మాణం కోసం తన స్వంత భూమిని, నిర్మాణ సామగ్రిని కూడా అందజేసి మంచి వదాన్యుడిగా ప్రశంసలను అందుకున్నారు. 1939 లో బీహార్ శాసన మండలి సభ్యునిగా బాధ్యతలు చేపట్టిన ఆయన స్వాతంత్ర్యం వచ్చాక కూడా 1951 వరకు శాసన మండలి సభ్యునిగా కొనసాగారు. ఆ సందర్భంగా ఆయన పార్లమెంటరీ సెక్రటరీగా, ఫ్లోర్ లీడర్ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించారు. 1940లో అఖిల భారత ముస్లిం లీగ్ చేసిన భారత విభజన తీర్మానాన్ని ఖండిస్తూ 'భయానక, తుంటరి అడుగు'గా ఆ తీర్మానాన్ని తూర్పారపట్టారు. భారత విభజన తగదంటూ వేర్పాటువాదాన్ని విమర్శించారు. 1942 నుండి 1944 వరకు హజారిబాగ్ జైలులో ఉన్నప్పుడు ఆయన రచించిన 'తలాష్ ఎ మంజిల్' (Talash e Manzil) గ్రంథంలో మిశ్రమ సంస్కృతి పరిరక్షణావశ్యకతను గట్టిగా నొక్కి వక్కాణించారు. ముస్లిం ప్రజానీకాన్ని మరింతగా జాతీయోద్యమం దిశగా మళ్ళించేందుకు ఉద్దేశించబడిన 'ముస్లిం మాస్ కాంటాక్ట్ మూమెంట్' కార్యక్రమంలో ఆయన ముమ్మరంగా పాల్గొన్నారు. మాతృభూమి స్వాతంత్ర్యం సాధించుకున్నాక రాష్ట్ర రాజకీయాలల్లో ప్రధాన భూమిక నిర్వహించారు. 1956 నుండి 1962 వరకు రాజ్యసభ సభ్యునిగా ప్రజాసేవలో గడిపిన షాహ్ ముహమ్మద్ ఉమేర్ 1978 ఫిబ్రవరి 20న కన్నుమూసారు. ✤



# ఇరుగు పొరుగు
# పరస్పర సహకారంతో సత్సమాజ నిర్మాణం

**హిబా అర్జుమంద్ ఖాన్**

మనిషి జీవితం ప్రారంభంనుండే సంబంధాలు కూడా ప్రారంభమవుతాయి. పుడమిపై పాదం మోపింది మొదలు తల్లి దండ్రులు, బంధువులు, సమాజంతో జీవిస్తున్నంతకాలం, అనివార్యంగా మన పొరుగింటి వారితో కూడా బంధం ఏర్పడుతుంది. రక్తసంబంధం కాకపోయినప్పటికీ, జీవితంలో అకస్మాత్తుగా మనకు అత్యంత దగ్గరగా ఉండేవారు పొరుగువారే. ఈ బంధం మనం ఎంచుకున్నది కాదు, కానీ మన మంచితనాన్ని, మన సంస్కారాన్ని, మన మనసు లోతులను ప్రతిబింబించే ఒక సహజ సంబంధం.

ఇప్పటి జీవనశైలి వేగంగా మారింది. అపార్ట్‌మెంట్లు పెరిగాయి, గేటెడ్ కమ్యూనిటీలు ఏర్పడ్డాయి, మెట్లు, లిఫ్టులు, కారిడార్లలో ప్రశాంత నిశ్శబ్దం కనిపిస్తోంది. కానీ ఈ అభివృద్ధి వెనుక ఒక పెద్ద నష్టమూ జరుగుతోంది. మనుషుల మధ్య దూరం పెరుగుతోంది. వందల ఇళ్ల మధ్య ఉండి, పక్కింటి వారి పేరు కూడా తెలియని దశకు మనం చేరుకున్నాం. ఇంటికి బలమైన తలుపులు, సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్‌లు పెట్టుకున్నాం, కానీ మన హృదయం మాత్రం క్రమంగా కుచించుకుపోతోంది. ఈ పరిస్థితిలో పొరుగువారి హక్కులు అనేది కేవలం నైతిక విలువ మాత్రమే కాదు, ఒక మానవ సమాజం నిలబడటానికి అవసరమైన మూల స్తంభం.

పొరుగువారితో సంబంధం అంటే నిశ్శబ్దంగా ఉండడం, వారి దారికి ఎలాంటి ఆటంకాలు కల్పించకుండా ఉండడం వంటి సాధారణ నియమాలు మాత్రమే అని అనుకుంటాం. కానీ అసలు హక్కులు మరింత విశాలమైనవి, తాత్త్వికమైనవి. పక్కింటి వ్యక్తి బాధలో ఉన్నప్పుడు పరామర్శించడం, ఇంటి ముందు అరుగుపై ఉదాసీనంగా కూర్చుని ఉండే వృద్ధులను పలకరించడం, ఏదైనా ఇంటి తలుపు రెండు రోజులు మూసి ఉంటే ఆరా తీసి బాగున్నారా అని తెలుసుకోవడం, ఎదుటివారికి

ఇబ్బంది కలగకుండా చూడడం, మన సొంత ఆనందం, మన సొంత గోప్యత, మన సొంత జీవితం నడుమ కొంచెం ప్రేమకు, కొంచెం జాగ్రత్తకు, కొంచెం మనసుకు స్థానం ఇవ్వడం – ఇవన్నీ పొరుగువారి హక్కులే.

ఈ హక్కులు అన్ని మతాలు, సంస్కృతులు, సంప్రదాయాల్లోనూ ప్రస్తావించబడ్డాయి. చాలా కాలం క్రితం ఇళ్లకు గోడలు ఉండేవి కానీ హృదయాలకు గోడలు ఉండేవి కాదు. ఒక ఇంట్లో వండిన భోజనం సువాసన పక్కింటి తలుపును దాటి వెళ్లేది, పంచుకునే అలవాటు ఉండేది. నేడు భద్రత పేరు మీద మనం అంతర్జాలంలో ప్రపంచంతో కనెక్టవుతున్నాం కానీ పక్కింటితో కనెక్టవడాన్ని మాత్రం మర్చిపోతున్నాం. ఈ బేధం సమాజంగా మనం కోల్పోతున్న గొప్ప విలువ. పొరుగువారి ఉనికి మన భద్రతకు, మన మానసిక ప్రశాంతతకు, మన పిల్లల భవిష్యత్తుకు, మన సమాజ స్థిరత్వానికి ఎంత ముఖ్యమో మనం గ్రహించాలి.

మనకు తెలియకపోయినా, పక్కింటి పరదాల వెనుక ఎన్నో కథలు, వ్యథలూ ఉంటాయి. ఒంటరితనంతో పోరాడుతున్న వృద్ధులు ఉండొచ్చు; పిల్లలను ఒంటరిగా పెంచుతున్న తల్లి ఉండొచ్చు; ఉద్యోగం కోసం దూర ప్రాంతాల నుండి వచ్చిన యువకులు ఉండొచ్చు; చదువుల ఒత్తిడిలో నిస్పృహతో ఉన్న యువతీ, యువకులు ఉండొచ్చు. వారికి మనం తప్పనిసరిగా సహాయం చేయాల్సిన పని లేదేమో కానీ, ఒక మంచి మాట, ఒక పలకరింపు, దయనిండిన ఒక చల్లని చూపు వారి ఆలోచనను మార్చగల శక్తి కలిగి ఉంటుంది. ఇది చిన్న విషయం కాదని గ్రహించినపుడు మనిషితనం ఏ స్థాయిలో ఉన్నదో తెలుస్తుంది.

పొరుగువారిని నిర్లక్ష్యం చేయడం వల్ల నేటి సమాజం అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. అనుమానాలు, అపోహలు, అసహనం పెరుగుతున్నాయి. చిన్న చిన్న విషయాలు పెద్ద గొడవలకు దారి తీస్తున్నాయి. వినడానికి చెవులు లేకపోవడం, మాట్లాడటానికి మనసు లేకపోవడం, ఇవే సమాజాన్ని విభజించే నిజమైన గోడలు. ఈ గోడలు కూలాలంటే ముందు మనమధ్య సత్సంబంధాలు మెరుగుపడాలి. దానికి మనమే ముందడుగు వెయ్యాలి. 'ఎలా ఉన్నారు... బాగున్నారా?' అని అడగడం చిన్న పలకరింపే కానీ, అది నమ్మకానికి, విశ్వాసానికి, పరస్పర గౌరవానికి పునాది వేయగలదు.

ఆచరణలో పొరుగువారి హక్కుల్ని పాటించడం అంటే ఇంటిని

**మనిషితనానికి ప్రమాణం అతను ఎంత ధనవంతుడో, ఎంత చదివాడో, ఏ పొజిషన్‌లో ఉన్నాడో కాదు. పక్కింటి వారికి అతను ఎంతగా ఉపయోగ పడుతున్నాడన్నదే ప్రమాణం. ఎందుకంటే మన మంచితనం మనం ఇంట్లో కాదు, పక్కింటి ద్వారానే తెలుస్తుంది. కనుక మన మనసులు పొరుగువారికి దగ్గరగా ఉండాలి. పరస్పర సహకారం, పరస్పర ప్రేమాను రాగాల ద్వారానే సత్సమాజ నిర్మాణం సాధ్యం.**

శుభ్రంగా ఉంచటమే కాదు; మన హృదయం శుభ్రంగా ఉండాలి. పక్కింటి వారికి ఇబ్బంది కలిగించకుండా ఉండటం మాత్రమే కాదు; వారి సుఖంలో సంతోషపడటం, అవసరంలో అడగక ముందే సహాయం చేయడం. ఏ మతం అయినా, ఏ సంస్కృతి అయినా, మానవత్వమే కేంద్రంగా స్పందించే గుణం ఉండాలి. పొరుగువారి కష్టంలో మనం పాలుపంచుకుంటే, వారి భద్రత మన భద్రతగా మారుతుంది. పొరుగిల్లు ప్రశాంతంగా ఉంటే, మన ఇల్లూ ప్రశాంతంగా ఉంటుంది.

ఎవరికైనా అత్యవసర పరిస్థితి వస్తే, బయటి నుండి వచ్చే సహాయంకంటే ముందుగా స్పందించేది పొరుగువారే. ఒక సమాజం బలపడాలంటే అది ముందుగా పొరుగువారి బంధంతోనే బలపడాలి. మనం ఈ బంధాన్ని గౌరవిస్తే, ప్రేమిస్తే, సంరక్షిస్తే, మన వీధులు, మన కాలనీలు, మన సమాజం, మనదేశం, మన పిల్లల భవిష్యత్తు మరింత సురక్షితంగా మారుతుంది.

మనిషితనానికి ప్రమాణం అతను ఎంత ధనవంతుడో, ఎంత చదివాడో, ఏ పొజిషన్‌లో ఉన్నాడో కాదు. పక్కింటి వారికి అతను ఎంతగా ఉపయోగపడుతున్నాడన్నదే ప్రమాణం. ఎందుకంటే మన మంచితనం మనం ఇంట్లో కాదు, పక్కింటి ద్వారానే తెలుస్తుంది. కనుక మన మనసులు పొరుగువారికి దగ్గరగా ఉండాలి. పరస్పర సహకారం, పరస్పర ప్రేమాను రాగాల ద్వారానే సత్సమాజ నిర్మాణం సాధ్యం. ✤

6

గతంలోకి ఒక చూపు..

# ఎమర్జెన్సీలో నేను




ఎస్.ఎమ్.మలిక్

## 2. కార్యకర్తల కుటుంబాలు

ఎమర్జెన్సీలో ఒక రోజు సయ్యద్ యాకూబ్ షా మియా, సయ్యద్ యూసుఫ్ గారి తమ్ముడు వచ్చి, "జమాఅత్ నాయకులు, సభ్యులు, కార్యకర్తలు అరెస్ట్ అయినవారి కుటుంబాల వారు చాలా మంది ఆర్థికంగా ఇబ్బందికి గురయి ఉండవచ్చు, వారిని ఆదుకోవడం అవసరం కదా" అని బాధగా చెప్పారు. నేను కూడా "నిజమే, ఏం చేద్దాం" అని అడిగాను. "మనం జమాఅత్ సమర్థకుల వద్ద విరాళాలు వసూలు చేసి వారికి సహాయ పడటం సాధ్యం కాదా?" అని ప్రశ్నించారు. అవును సాధ్యమే అన్నాను నేను.

ఇద్దరం కలిసి ఓ పథకం తయారు చేసుకున్నాము. యాకూబ్ షా మియా వసూలు చేసేవారిగాను, నేను దేశంలో ఎల్లెడలా తిరిగి బాధితుల్ని గుర్తించి సహాయం అందజేసే వానిగాను నిర్ణయించు కున్నాము. ఆ విధంగా మొదట కేంద్ర కార్యాలయం పరిస్థితిని పరిశీలించాలని అనుకున్నాము. అదృష్ట వశాత్తు మద్రాసులోనూ అరెస్టు కాని జమీల్ భాయి ఆ రోజుల్లోనే హైదరాబాద్‌కు వచ్చారు, నేనెలా ఉన్నానో విచారించడానికి. నేను, యాకూబ్ షా మియాతో కలసి చేసుకున్న నిర్ణయం గురించి ఆయనకు వివరించాను. ఆయన మెచ్చుకున్నారు. తాను కూడా ఈ సత్కార్యంలో తోడ్పడతానని ముందుకు వచ్చారు.

## బాధితుల సహాయార్థం

యాకూబ్ షా మియా వసూలు చేసిన కొంత రొక్కం తీసుకుని నేనూ జమీల్ భాయి కలిసి ఢిల్లీకి ప్రయాణమయ్యాము. ఢిల్లీలో జమాఅత్ కేంద్ర కార్యాలయం సీలు చేసినా కార్యకర్తల నివాస భాగం వదిలేశారు. అందువల్ల మేము ఆ రోజుల్లో మౌలానా ఫారూక్ ఖాన్ గారి రూమ్‌లో బస చేశాము. అమీర్ జమాఅత్, మౌలానా ముహమ్మద్ యూసుఫ్ గారు నివాసముంటున్న విభాగానికి సులువుగా వెళ్ళ గలిగాము. యాదృచ్ఛికంగా ఆ రోజుల్లో మౌలానా అనారోగ్యం కారణంగా పెరోల్ మీద వచ్చి ఉన్నారు. ఆ విధంగా మాకు ఆయన్ని కలుసుకునే అవకాశం కలిగింది. ఆయన ఆరోగ్యం గురించి విచారించిన తరువాత మేము వచ్చిన పని చెప్పాము.

మౌలానా ముహమ్మద్ యూసుఫ్ మా ఈ నిర్ణయాన్ని ఎంతో కొనియాడారు. ఆయన ఆదేశం మేరకు మేమిద్దరం తొలుత రాంపూర్ వెళ్ళి అక్కడ అల్ హసనాత్ మాస పత్రిక సంపాదకులు, మౌలానా అబూసలీమ్ అబ్దుల్ హైని కలుసుకున్నాము. నన్ను గుర్తు పట్టి ఆయన ఎంతో సంతోషపడి మా విశ్రాంతి కోసం రూమ్ రెడీ చేయమని తన కుమారునికి పురమాయించ సాగారు. మేము వచ్చిన కార్యం గురించి చెప్పుకున్నాము. దానికి ఆయన, తమ వల్ల అయినంతమట్టుకు చేస్తున్నట్లు చెప్పారు. వెళ్ళ గలిగితే మురాదాబాద్‌కు వెళ్ళడం మంచిది అన్నారాయన.

## రమజాన్‌లో పర్యటన

అది రమజాన్ నెల కావటాన అక్కడ సహరీ చేసుకుని కాస్సేపు విశ్రమించి మురాదాబాద్‌లో ఆయన ఇచ్చిన అడ్రసుకు బయలుదేరాము. అక్కడ కొందరు కార్యకర్తల్ని కలుసుకుని విషయం చెప్పాము. ఇక్కడ తాము కూడా అవసరమయిన కుటుంబాలకు

సహాయం అందజేస్తున్నట్లు వారు తెలిపారు. అయితే ఇంత దూరం వచ్చినందుకు మేము తెచ్చిన రొక్కంలో నుంచి కొంత వారికి ఇచ్చి, అవసరమయితే మాకు తెలుపమని మా అడ్రస్ వారికి ఇచ్చి అక్కడి నుండి భోపాల్‌కు ప్రయాణమయ్యాము.

భోపాల్ రైల్వే స్టేషన్ బయటికి రాగానే హోటళ్లు కనిపించాయి. బ్రతుకు జీవుడా అనుకుంటూ, అది సహరీ వేళ కావడంతో ఓ హోటల్‌లోకి దూరాము. హోటల్ యజమాని ముందుకు వచ్చి,

“మీరు ప్రయాణీకుల్లా ఉన్నారు, ఇటు రండి, ముఖం కడుక్కోండి” అన్నారు.

నేను అందుకుని, “అంతా అయింది, సహరీ ఉందా?” అని అడిగాను.

“రెడీగా ఉంది, రండి, కూర్చోండి” అన్నారాయన.

సహరీ అయిన తరువాత మస్జిద్ గురించి విచారించి అటు వెళ్ళాము.

## కార్యకర్తల పరిస్థితి

నమాజ్ తరువాత మస్జిద్‌లోనే కాస్సేపు సేద తీరి ఆటోలో నగరంలోకి కార్యకర్తల అడ్రస్ వెతుక్కుంటూ బయలుదేరాము. భోపాల్‌లో అక్కడి అమీర్, మౌలానా ఇనాముర్రహ్మాన్ ఖాన్ గారి ఇంటికి వెళ్ళి ఆయన అబ్బాయిని కలసుకుని ఇంటి విషయాలు విచారించి తెలుసు కున్నాము. ఆ పైన అక్కడి కార్యకర్తల్ని విచారించగా తమ వల్ల కాగలిగింది చేస్తున్నామని అయినా చెయ్యి చాచి అర్థించని వారెందరో ఉన్నారని వారి వరకు మేము చేయూత అందజేయలేక పోతున్నామని చెప్పు కున్నారు. మేము వారికి ఉన్న రొక్కం అందజేసి అవసరం కలిగితే వ్రాయవలసిందని చెప్పి వారికి వీడ్కోలు పలుకుతూ బయలు దేరి హైదరాబాద్ చేరాము.

హైదరాబాద్‌లో పర్యటన వివరాలు మిత్రులకు తెలిపి ఇక దక్షిణ ప్రాంతాల్లో పర్యటించవలసి ఉందని, పండుగ ఇంకా కొన్ని రోజులే ఉండటం వల్ల ఆ తరువాత ప్రారంభించాలని నిర్ణయించుకున్నాము. జమీల్ భాయి మద్రాసుకు వెళ్ళి పోయారు. నేను ఎప్పటిలానే జమీల్ భాయితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూనే ఉన్నాను. ఆ కాలంలో నేను వ్రాసిన ఉత్తరాలు ఆయనకు చేరలేదు, ఆయన వ్రాసిన ఉత్తరాలు నాకూ చేరలేదు. మధ్యలో సీఐడీలు స్వాహా చేశారు వాటిని! ఆ రోజుల్లో ఉపఖండం అనిపించుకున్న మన దేశం ఓ మహా కారాగారంగా మారిందని చెప్పుకున్నారు ఆ నాటి మేధావులు.

## మద్రాసు ప్రయాణం

ముందే అనుకున్న దాని ప్రకారం నేను ఒంటరిగానే మద్రాసుకు బయలుదేరాను. మద్రాసులో జమీల్‌భాయి నా కొరకే వేచి ఉన్నారు. నేను అక్కడికి చేరగానే ఒక్కొక్క సభ్యుని పరిస్థితులు విచారించ సాగాము. జమాఅత్ సభ్యులు అందరూ ఆర్థికంగా వెనుకబడినవారే కాబట్టి సహాయం దాదాపు అందరికీ అవసరమే. అదేవిధంగా వీలయినంత మేర సహాయం అందజేశాము. కొన్ని కుటుంబాల వారు అనివార్యంగా సహాయం తీసుకుంటూ తమ దుఃఖాన్ని ఆపుకోలేక పోయారు. వారిని ఓదార్చడం చాలా కష్టమయింది. వారంతా ఆర్థికంగా మధ్య తరగతి వారే అయినప్పటికీ సదా పై చెయ్యే గాని క్రింద చెయ్యి పెట్టడం ఎరుగరు.

ఈ విధంగా నేనూ జమీల్ భాయి, ఒక్కోసారి నేను ఒక్కణ్ణే ఎమర్జెన్సీ పీడితుల సహాయార్థం, ఇంకా రెండు పర్యటనలు జరిపాము. ఆ సందర్భంలో అనేక బాధాతప్త గాథలు ముందుకు వచ్చాయి. అవన్నీ ఇప్పుడు సరిగ్గా గుర్తు లేవు. అప్పటి మరో విషయం ఏమిటంటే మౌలానా అబ్దుర్రజ్జాక్ లతీఫీ మరణానంతరం మౌలానా అబ్దుల్ అజీజ్ గారిని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి, జనాబ్ ఖాన్(ఔరంగాబాద్) గారిని తమిళనాడుకు అమీర్ హల్కా గా నియమించడం జరిగింది. కాని వీరిద్దరూ చార్జ్ తీసుకునే లోపుగానే ఎమర్జెన్సీ ప్రకటించడం, వారిరివురినీ నిర్బంధిచడమూ జరిగింది.

ఆ కాలంలో హాఫిజ్ అన్వారుల్లాహ్ మహ్మూద్ గారు కిడ్నీ (మూత్ర పిండాలు) లో రాళ్ళు ప్రోగయ్యే వ్యాధితో బాధపడుతున్నారు. ఆ చికిత్స నిమిత్తం ఆయన జైలు డాక్టర్ సిఫారసు మేరకు చార్మినార్ వద్ద ఉన్న యూనానీ హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారు. ఆయనకు తోడుగా పోలీసు పహారాతోపాటు ఉండటానికి ఒక వ్యక్తికి అనుమతి లభించింది. ఆ విధంగా నేను ఆయనకు తోడుగా ఉండేవాణ్ణి. శ్రీమతి ఇందిరా గాంధీకి పిచ్చెక్కి ఎన్నికలు ప్రకటించగా ఫలితాలు వెలువడుతున్న రోజులు అవి. నేను ఆసక్తిగా రేడియోలో ఎన్నికల ఫలితాలు వింటున్నాను.

ఎన్నికల్లో ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ ఓడిపోవడమే కాకుండా కాంగ్రెస్ పార్టీ కూడా అధికారానికి పూర్తిగా దూరమయి పోయింది. పర్యవసానంగా ఎమర్జెన్సీ ఎత్తివేయడమూ జరిగింది. హాఫిజ్ సాహిబ్‌కు పహరా కాస్తున్న పోలీస్ అధికారి ముఖం కూడా విప్పారింది! ఇక మాకు ఎవరికీ నిద్ర పట్ట లేదు. ఫజ్ర్ వేళ వరకు మేము మాటలాడుకుంటూనే గడిపాము. ఫజ్ర్ నమాజ్ ముగించిన తరువాత నేను హాఫిజ్ గారి వద్ద సెలవు తీసుకుని ఇంటికి బయలు దేరాను. హాస్పిటల్ నుండి బయటికి రాగానే ఏదో కొత్త ఉదయంగా, సరికొత్త వాతావరణంగా, ప్రతిబంధకాలు అన్నీ తెగిపోయినట్లుగా, అంతటా స్వేచ్ఛా వాయువులు వీస్తున్నట్లుగా, అంతా ఆహ్లాదకరంగా మారినట్లు అనిపించసాగింది!

నా ఆంతర్యంలోని స్వేచ్ఛ జగమంతా పరచుకున్నదేమో!

అంతటితో ఎమర్జెన్సీ భయంకర యుగం ముగిసింది!!



# ఇస్లామ్‌లో మానవ హక్కుల రక్షణ

తహూరా సిద్దీఖా

**టెక్నాలజీ**లో ఎక్కడికో దూసుకుపోతున్న ఈ రోజుల్లో కూడా, జాతి వైషమ్యాలు, అసమానతలు మనల్ని ఇంకా వెంటాడు తున్నాయి. తరతరాలుగా వస్తున్న ఈ బాధకు పరిష్కారం లేదా?

మనం జీవిస్తున్న ఈ యుగం అపూర్వమైన సాంకేతిక వైభవాన్ని చూస్తోంది. మన చేతుల్లో ప్రపంచమే ఉంది. కానీ, దురదృష్టవ శాత్తు, చరిత్రలో మానవాళిని పీడించిన పక్షపాతాలు, అసమానతలు, అన్యాయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ చీకటి మనల్ని అంతులేని మానవ బాధల్లోకి నెట్టివేస్తోంది. సరిగ్గా ఈ కష్టకాలంలోనే, మానవ హక్కుల గురించి చర్చించడం చాలా కీలకం.

మానవ హక్కులు అంటే ఏమిటి? ప్రతి మనిషికి, సమాజంలోని ప్రతి సభ్యుడికి అవి విశ్వజనీయంగా దక్కేలా మనం ఒక ఉమ్మడి అవగాహనకు రాగలమా? ఈ ప్రశ్నలు మాగ్నా కార్టా నుంచి జెనీవా కన్వెన్షన్ వరకూ చారిత్రక పత్రాలలో చర్చకు వచ్చాయి.

అయితే, తరచుగా మనం మరచిపోయే ఒక కోణం ఉంది : ఈ లోతైన ప్రశ్నలను వివిధ మత సంప్రదాయాలు కూడా పరిష్కరించాయి. ప్రత్యేకించి, ఇస్లాం మానవ హక్కుల నమూనా దాని దృఢత్వం, విశాల దృష్టి, ఆధునిక కాలానికి దాని ఔచిత్యం పరంగా మనల్ని ఆశ్చర్యపరుస్తుంది.

ప్రపంచ చరిత్రను, నేటి వాస్తవాలను చూస్తే ఇస్లాం కృషి ఎంత గొప్పదో అర్థమవుతుంది. ఎందుకంటే, సామాజిక, జాతి, లింగ , మతపరమైన అసమానతలు ఎప్పుడూ ఉంటూనే ఉన్నాయి. నల్లని చర్మం ఉన్నవారిని బానిసలుగా చేయడం, స్త్రీలను అహంకారపూరిత వైఖరులతో అణచివేయడం, మత ఆధిపత్యంతో భిన్న విశ్వాసులపై హింస... ఈ చరిత్ర మన కళ్ళ ముందుంది.

గ్రంథాలలో నిర్దేశించిన పవిత్ర హక్కులు వేరు, అసంపూర్ణ మానవులైన మనం వాటిని తప్పుగా అమలు చేయడం వేరు. పాశ్చాత్య సమాజాలు వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్నట్లే, ముస్లిం సమాజాలు కూడా ఇస్లామిక్ మానవ హక్కుల స్ఫూర్తిని పూర్తిగా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయి.

## దైవం నిర్దేశించిన హక్కులు

ఇస్లాంలో మానవ హక్కుల గొప్ప లక్షణం ఏమిటంటే, ఈ హక్కులు సామాజిక ప్రవర్తన నుండి సహజంగా ఉద్భవిస్తాయి. ఇవి ముస్లింలు దైవం నుండి వచ్చిన పవిత్ర ఆజ్ఞలుగా విశ్వసిస్తారు.

మహిమాన్వితమైన ఖురాన్ మన హృదయాలకు ఇలా ఆజ్ఞాపిస్తోంది: "న్యాయం చెయ్యండి అనీ, ఉపకారం చెయ్యండి అనీ, బంధువుల హక్కులు నెరవేర్చండి అనీ అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు. చెడునూ, అశ్లీలతనూ, అన్యాయాన్నీ, మితిమీరి ప్రవర్తించటాన్నీ నిషేధిస్తున్నాడు. ఆయన మీకు హితబోధ చేస్తున్నాడు, మీరు గుణపాఠం నేర్చుకోవాలని." (ఖురాన్, 16:90-91)

## మానవాళి మొత్తానికి ఒకే పునాదిని ఇస్తుంది:

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం

చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు.''

(ఖురాన్ 49:13)

మన రూపాలు, రంగులు దేవుని మహిమకు, జ్ఞానానికి నిదర్శనం. ఒకరిపై ఒకరికి ఆధిపత్యం చూపడానికి అవి కారణం కాకూడదు. జాతి వివక్ష అనేది ఇస్లాం స్ఫూర్తికి  పూర్తి విరుద్ధం.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ సత్యాన్ని ఎంత అందంగా చెప్పారో చూడండి:

''ఒక అరబ్బుకు అరబ్బేతరుడిపై గానీ, అరబ్బేతరుడికి అరబ్బుపైగానీ, నల్లవానికి తెల్లవానిపై గానీ, తెల్లవానికి నల్లవానిపై గానీ ఎలాంటి ఆధిక్యత లేదు. మీరందరూ ఆదమ్ సంతానం. ఆదమ్ మట్టి నుండి సృష్టించబడ్డాడు.''

## గౌరవం - సమానత్వం

మానవ హక్కులకు రెండు పునాదులు ఉన్నాయి: గౌరవం-సమానత్వం.

మీరు కేవలం మనిషి అయినందుకు, అల్లాహ్ మిమ్మల్ని గౌరవించాడు. ఖురాన్ ఇలా అంటోంది: ''మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూను. ''

(ఖురాన్ 17:70)

**స్త్రీ సమానత్వం :** స్త్రీలు, పురుషులతో ఆధ్యాత్మికంగా సమానంగా ఉంటారు. వారు తమ ప్రార్థనలు, సత్కార్యాలకు ప్రతిఫలం పొందుతారు. పురుషులతో సమానంగా, వారు తమ కుటుంబ, సామాజిక బాధ్యతలను పంచుకుంటారు. స్త్రీలు ఆస్తిని కలిగి ఉండవచ్చు, వ్యాపారాలు చేయవచ్చు, ఓటు వేయవచ్చు, విద్యను పొందవచ్చు. ముస్లిం సమాజాలు వారికి ఈ హక్కులన్నీ ఇవ్వడంలో వెనుకబడి ఉండవచ్చు, కానీ అది దైవిక ఆదేశం యొక్క వైఫల్యం కాదు, అది కేవలం మానవ వైఫల్యం మాత్రమే.

**జీవించే హక్కు :** ప్రాణం దేవుని నుండి వచ్చిన పవిత్రమైన అప్పగింత. ''హత్యకు బదులుగాగాని లేదా కల్లోలాన్ని వ్యాపింప జేసినందుకుగాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే.''(ఖురాన్, 5:32) అంటే, మన పొరుగువారిని ప్రమాదం నుండి రక్షించడం కూడా మన బాధ్యతే.

యుద్ధ సమయాల్లో కూడా, ఇస్లాం గౌరవాన్ని బోధిస్తుంది. పోరాటంలో లేనివారిని (స్త్రీలు, పిల్లలు, వృద్ధులు) చంపడం నిషేధించబడింది. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక మృతదేహాన్ని చూసి, ''ఆమె పోరాడటం లేదు. మరి ఆమె ఎలా చంపబడింది?''అని ప్రశ్నించారు. ఇది ఎంత లోతైన మానవత్వం!

**విశ్వాసాల స్వేచ్ఛ :** నిజమైన ఇస్లామిక్ రాజ్యం విభిన్నతను గౌరవించాలి. ముస్లిమేతరులు వారి మతాన్ని పాటించడానికి అనుమతించబడతారు. స్పెయిన్ ముస్లింల పాలనలో ఉన్నప్పుడు, కార్డోబా జ్ఞాన కేంద్రంగా ఉండేది, అక్కడ ముస్లిం, యూదు, క్రైస్తవ పండితులు కలిసి బోధించేవారు. సహనం అప్పటి యూరప్‌లో అరుదైన గుణం.

**ప్రాథమిక జీవన ప్రమాణం హక్కు :** ఆహారం, ఆశ్రయం, వైద్య సంరక్షణ... ఇవి ప్రతి మనిషి కనీస అవసరాలు. వీటిని అందుకోవడానికి పేదవారు అర్హులు. ఖురాన్ చెబుతోంది: ''వారి సంపదలో యాచకులకూ, అగత్యం కలవారికీ హక్కు ఉండేది.'' (ఖురాన్ 51:19) మనకు తగినంత ఉంటే, పేదరికాన్ని నిర్మూలించడానికి ఇవ్వడం మన బాధ్యత.

**న్యాయం హక్కు :** జాతి, మతం, జాతీయతతో సంబంధం లేకుండా, స్నేహితులైనా శత్రువులైనా, ప్రతి ఒక్కరితో న్యాయంగా వ్యవహరించాలని ఇస్లాం కోరుతుంది.

''(ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సరిసమానమైనది'' (ఖురాన్ 5:8)

ఈ న్యాయ భావం ఎంత అద్భుతమైనదంటే, ఇది మన రోజువారీ జీవితానికి ఆచరణాత్మక నీతిని అందిస్తుంది.

## పరస్పర బాధ్యత

భార్యగా, తల్లిదండ్రులుగా, పిల్లలుగా,  పొరుగువారిగా, స్నేహితుడిగా, ప్రతి వ్యక్తికి దైవం నిర్దేశించిన హక్కులను, బాధ్యతలను ఇచ్చింది ఇస్లామ్ ధర్మం.

ప్రపంచాన్ని పీడిస్తున్న అన్ని సామాజిక, జాతి, లింగ సమస్యలకు ఇస్లాం పరిష్కారం చూపింది. ఇస్లాంలో పొందుపరచబడిన ఈ హక్కులు- బాధ్యతల నమూనా, వ్యక్తిగత, సామాజిక సంస్కరణకు అపారమైన శక్తిని కలిగి ఉంది. ప్రతి హక్కు ఒక బాధ్యత నుండి ఉద్భవించింది అనే ఈ సత్యాన్ని మనం గ్రహించిన రోజు, మానవజాతికి నిజమైన స్వేచ్ఛ, శాంతి లభిస్తుంది.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

38 ఆయత్‌లు

# 47. ముహమ్మద్

మదీనా అవతరణ

... 4 – 6 ఇదీ మీరు చేయవలసిన పని. అల్లాహ్ కోరినట్లయితే తాను స్వయంగానే వారిని మార్చొనేవాడే, కాని (ఈ విధానాన్ని ఆయన అవలంబించడానికి కారణం) మిమ్మల్ని ఒకరి ద్వారా మరొకరిని పరీక్షించాలన్నది ఆయన అభీష్టం.[9] అల్లాహ్ మార్గంలో ఎవరయితే హతులవుతారో అల్లాహ్ వారి ఆచరణలను ఎంతమాత్రం వృథా పోనివ్వడు.[10] ఆయన వారికి మార్గనిర్దేశన చేస్తాడు, వారి పరిస్థితిని చక్కబరుస్తాడు, వారికి ముందే ఎరుకపరచి ఉన్న స్వర్గంలోకి వారిని ప్రవేశింపజేస్తాడు.[11]

7 – 8 విశ్వసించిన జనులారా, మీరు అల్లాహ్‌కు సహాయం చేసినట్లయితే ఆయన మీకు సహాయ పడతాడు,[12] మీ పాదాలను పటిష్ఠంగా స్థిరపరుస్తాడు. పోతే, ఎవరయితే తిరస్కారానికి పాల్పడ్డారో, వారికి వినాశం తప్పదు.[13] అల్లాహ్ వారి ఆచరణలను దారి తప్పించాడు.

9. అంటే, అల్లాహ్‌కు కేవలం మిథ్యావాదులను అణగద్రొక్కాలనే ఉంటే దీనికి మీ ఆవశ్యకత లేదు. ఈ పని ఆయన పుట్టించే ఒక భూకంపం, ఒక తుఫాను రెప్పపాటు కాలంలో నెరవేర్చ గలదు. ఆయన దృష్టిలో ఉన్న ఉద్దేశ్యం, మానవుల్లో సత్యకాముకులయినవారు, మిథ్యావాదులను ఢీకొనాలి, వారికెదురుగా సమరశీలంతో పోరాడాలి. తద్వారా ఎవరిలో ఎటువంటి గుణగణాలున్నాయో అవన్నీ ఈ పరీక్షలో బాగా వికసించి బహిర్గతమవ్వాలి. ప్రతి ఒక్కరు తమ చరిత్ర, శీల స్వభావాల రీత్యా ఏ స్థాయి, స్థానాలకు అర్హులో అది వారికి ఇవ్వాలి అన్నది.

10. భావమేమిటంటే, ఒకరు దైవమార్గంలో హతులయ్యారంటే ఆ మనిషి తన ప్రాణాలు కోల్పోయాడని, అతని వ్యక్తిగత స్థాయిలో అతను చేసుకున్నదంతా మట్టిపాలయి పోయిందని దాని అర్థం కాదు. షహీదుల (అమరగతుల) త్యాగాలు స్వయంగా వారి కొరకు కాక కేవలం వారి తరువాత ప్రపంచంలో బ్రతికి ఉన్న వారి కొరకే ప్రయోజనకరమయినవనీ, వారే వారి త్యాగాల ఫలాలు ఆస్వాదిస్తారని ఎవరయినా భావిస్తే అది ఖచ్చితంగా తప్పే. అసలు యదార్థం ఏమిటంటే స్వయంగా షహీదుల కొరకు కూడా ఇది నష్టకరం కాదు, లాభసాటి బేరమే.

11. దైవమార్గంలో అసువులు బాసిన వారికి ప్రాప్తమయ్యే ప్రయోజనం ఇదే. దీనికి మూడు స్థానాలు చెప్పబడ్డాయి. ఒకటి, అల్లాహ్ వారికి మార్గనిర్దేశన చేస్తాడు రెండు, వారి స్థితిగతులను చక్కబరుస్తాడు మూడు, వారిని స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు, దీన్ని గురించి ఆయన వారికి మునుపే ఎరుకపరచి ఉన్నాడు. మార్గనిర్దేశన చేయడమంటే, ఇక్కడ ఉద్దేశం స్వర్గం వైపునకు మార్గనిర్దేశన చేయడమన్నది ద్యోతకమవుతూనే ఉంది. వారి స్థితిగతులు చక్కబరచడమంటే స్వర్గ ప్రవేశానికి ముందు పరమ ప్రభువు అల్లాహ్ వారికి తన బహూకరణలతో అలంకరించి అక్కడికి తీసుకువెడతాడు, ఇంకా ప్రపంచంలో వారికి అంటుకున్న ప్రతి మాలిన్యాన్నీ దూరం చేసి పరిశుద్ధపరుస్తాడు అని భావం. మూడవ స్థాయికి భావమేమిటంటే ప్రపంచంలో ఖుర్ఆన్, ప్రవక్త (స) నోట ముందే వారికి తెలుపడం జరిగింది, వారి కొరకు అల్లాహ్ సిద్ధపరచి ఉంచిన స్వర్గం ఎటువంటిదో. ఆ స్వర్గంలో వారు ప్రవేశించగానే వారు తమకు చిరపరిచితమయిన దానిలోనే ప్రవేశిస్తారు. తమకు ఏ వస్తువు ప్రదానం చేసే వాగ్దానం చేయడం జరిగిందో అదే వారికి ఇవ్వబడిందని, అందులో ఇసుమంతయినా వ్యత్యాసం లేదని వారు తెలుసుకుంటారు అని భావం.

12. అల్లాహ్‌కు సహాయం చేయడమంటే అతి సాధారణ భావం, ఆయన వచనాన్ని సమున్నత పరచడానికి ధన ప్రాణాలతో జిహాద్, నిరంతర కృషి సలపడం. కాని దానికి మరో నిగూఢ అర్థమూ ఉంది. దాన్ని మేము మునుపు విశదీకరించి ఉన్నాము. (ఖుర్ఆన్ అవగాహనం:సం. 1, ఆలి ఇమ్రాన్ : పాదసూచి 50 చూడండి).

13. మూలంలోని పదాలు **'ఫతఅసన్‌ల్లహుమ్'** అన్నవి. అందులోని పదం **'తఅసన్'** అంటే ఎదురుదెబ్బ తగిలి బోర్లాపడి పోవడం అన్నమాట.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)

తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ التَّفْسِيرِ

## ఖుర్‌ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం

(కితాబుత్తఫ్సీర్)

**2. అల్ బఖరా**

### అధ్యాయం : 30

## మేలు చేసేవారిని అల్లాహ్ ఇష్టపడతాడు

దైవోపదేశం :

"అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టండి. చేతులారా మిమ్మల్ని మీరు వినాశం పాలు చేసుకోకండి. మేలు చెయ్యండి. మేలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు." *(2: 195)*

**365)** హుజైఫా (రజి) వివరించారు: **"వ అన్‌ఫిఖూ ఫీ సబీలిల్లాహి వలా తుల్‌ఖూ బి అయ్‌దీకుమ్ ఇలత్తహ్‌లుకతి"** (దైవ మార్గంలో ఖర్చుపెడుతూ ఉండండి. మిమ్మల్ని మీరు చేజేతులా నాశనం చేసుకోకండి) అనే ఆయత్ (ప్రజల్లో) 'ఇన్‌ఫాఖ్'ని ప్రేరేపించడానికి అవతరించింది.[1]

### అధ్యాయం : 31

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : (హజ్జ్ సందర్భంగా) మీలో ఎవరయినా వ్యాధిగ్రస్తులై లేదా తల బాధకు లోనై (ఖుర్బానీ తన స్థానానికి చేరకముందే) శిరోముండనం చేయించుకుంటే దానికి పరిహారంగా ఉపవాసం ఉండాలి లేక దానధర్మాలు చేయాలి లేక ఖుర్బానీ ఇవ్వాలి... *(2: 196)*

**366)** అబ్దుల్లాహ్ బిన్ మాఖిల్ కథనం: నేను కాబ్ బిన్ ఉజ్రా (రజి) సన్నిధికి, ఆ మస్జిద్‌కు వెళ్ళాను. అంటే కూఫా లోని మస్జిద్‌కు వెళ్ళి పరిహారం (ఫిదియా)గా ఉపవాసం ఉండటం గురించి ఆయన్ని అడిగాను. సమాధానంగా ఆయన ఇలా అన్నారు: నేను ఇహ్రామ్ కట్టుకుని ఉన్న స్థితిలో జనులు నన్ను దైవ ప్రవక్త(స) సన్నిధికి తీసుకెళ్ళారు. ఆ సమయంలో నా తలలోని పేలు నా ముఖంపై పడుతూ ఉన్నాయి. అది గమనించి, "నీ పరిస్థితి ఇంత దయనీయంగా తయారవు తుందని నేను ఊహించలేదు. నీవు ఒక మేకను సమర్పించుకోగలవా?" అని దైవ ప్రవక్త(స) అడిగారు. దానికి నేను 'లేదు' అని విన్నవించుకున్నాను. "అలాగైతే మూడు రోజులు ఉపవాసం ఉండు. లేదా ఆరుగురు నిరుపేదలకు అన్నం పెట్టు. ప్రతి నిరుపేదకు 'అర్థ సా' చొప్పున భోజనం తినిపించి శిరోముండనం చేయించుకో" అని ఉపదేశించారు మహనీయ ముహమ్మద్(స). కాబ్ బిన్ ఉజ్రా(రజి) ఇంకా ఇలా అన్నారు: 'ఈ ఆయత్ ప్రత్యేకంగా నా గురించి అవతరించింది. అయితే దీని ఆజ్ఞ మీ అందరికీ వర్తిస్తుంది.'

*365-1. అంటే పిసినారితనం చూపి మీ పరలోక జీవితాన్ని పాడు చేసుకోకండి అని అర్థం. ఇమామ్ ముస్లిం తదితరులు అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) నుండి ఉటంకించబడిన దాని ప్రకారం ఒక ముస్లిం రోమ్ అవిశ్వాసుల పంక్తుల్లోకి చొచ్చుకు పోయాడు. ఇతను తనను తాను వినాశానికి గురి చేసుకున్నాడని జనులు చెప్పుకున్నారు. అప్పుడు అబూ అయ్యూబ్(రజి), **"వలా తఖ్‌తులూ బిఅయ్‌దీకుమ్..."** (2 : 198) ఆయత్ అర్థం ఇది కాదని, ఈ ఆయత్ అన్సారులమైన మా నేపథ్యంలో అవతరించిందనీ, ముస్లింల సంఖ్య బాగా పెరిగినప్పుడు, మేము ఇండ్లల్లోనే ఉండి మా ఆస్తిపాస్తులను పెంచుకుంటామని చెప్పినప్పుడు అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు. 'వినాశంపాలు చేసుకోకండి' అంటే అర్థం ఇక్కడ ఇంటి పట్టునే ఉండిపోవటం, దైవమార్గంలో సమరం చేయకుండా ఉండటం అని చెప్పారు.*

# కత్తి వేలాడుతోంది!

- షేక్ హసన్ సాహెబ్

**ఒకానొకప్పుడు,** పాలకుడిని కలుసుకోవడానికి ఒక సామాన్య పౌరుడు రాజ సభకు వెళ్ళాడు. రాజవైభవం, సుఖసంతోషాలు నిండిన జీవితం చూసి పాలకుడిపట్ల అసూయ కలిగింది అతనికి.

పాలకుడు అతనిని ఆప్యాయంగా పలకరించి, "మీ యోగ క్షేమాలు ఏమిటి?" అని అడిగాడు. దానికి ఆ సామాన్య వ్యక్తి కళ్ళలో నిస్సత్తువ నింపుకుని, తనను పీడిస్తున్న ఎన్నో చింతలను, బాధలను, అలజడులను ఏకరువు పెట్టాడు. తరువాత, రాజరికపు జీవితాన్ని చూసి దీర్ఘంగా నిట్టూర్చి ఇలా అన్నాడు: "ప్రభూ, మీరు నిజంగా అదృష్టవంతులు! మీ జీవితం ఎంత ప్రశాంతంగా, ఎంత సుఖంగా ఉంది! మీ భోజనం, పానీయం, నిద్ర... అన్నీ ఆనందమయమే కదా! లోకంలో మీకు భంగం కలిగించేదేదీ లేదు. మీరు రాజు, ఈ సకల సేవలు మీ చుట్టూ ఉన్నాయి."

పాలకుడు మౌనంగా ఉండిపోయాడు. అతని ముఖంలో ఎలాంటి భావమూ కనబడలేదు.

ఆ తర్వాత, పాలకుడు ఆ వ్యక్తిని తనతో కలిసి భోజనం చేయమని ఆహ్వానించాడు. రాజ విందులో కూర్చున్న ఆ వ్యక్తి తల పైభాగాన్ని సరిగ్గా గమనించాడు. అక్కడ... ఒక ఒర తీసిన పదునైన కత్తి, కేవలం ఒక బలహీనమైన దారంతో వేలాడుతోంది! ఆ దారం ఎప్పుడు తెగిపోతుందో, కత్తి ఎప్పుడు తనపై పడుతుందోననే భయం అతడి గుండెను పట్టి పీడించింది. ఆ క్షణమే, ఆ విందులోని రుచులు, వాసనలు అతని మనస్సు నుండి మాయమయ్యాయి.

పాలకుడు ప్రేమగా : "మీ ముందు ఉన్న ఆహారం చాలా రుచికరమైనది, సంతోషంగా భోజనం చేయండి," అన్నాడు.

దానికి ఆ వ్యక్తి వణుకుతున్న స్వరంతో : "ప్రభూ, ఈ ఆహారం ఎంత రుచికరమైనదైనా సరే, ఆ భయంకరమైన కత్తి నా తలపై పడుతుందనే భయంతో నా మనస్సు నిండిపోయింది. ఈ రుచిని ఆస్వాదించడానికి నా మనస్సు అంగీకరించడం లేదు," అన్నాడు.

అప్పుడు పాలకుడు నవ్వి, గంభీరంగా ఇలా అన్నాడు : "నువ్వు అసూయపడిన నా జీవితం కూడా సరిగ్గా ఈ కత్తి అంచున ఉంది!"

"నీకు తెలియనిది ఏమిటంటే, నువ్వు కోరుకుంటున్న నా అధికారం నిత్యం ప్రమాదంలో ఉంటుంది. నా శత్రువులు, నా వారసత్వాన్ని కోరుకునే బంధువులు... ఇలా ఎందరో నన్ను వెంటాడుతుంటారు. నేను నిద్రిస్తున్నప్పుడు హత్య చేయబడతానేమో, నా ఆహారంలో విషం కలుపుతారేమో, నాపై తిరుగుబాటు జరుగుతుందేమోనని ప్రతి క్షణం మృత్యు భయంతో జీవిస్తుంటాను."

"నా జీవితంలో ప్రతి గంటా... అంతులేని అసౌకర్యం, నిద్ర లేని రాత్రులు, ఎడతెగని భయం, ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండడం... ఇదే నా దినచర్య."

"నిజానికి, అదృష్టవంతుడివి నువ్వే! నువ్వు శాంతిగా నిద్రిస్తావు, నిర్భయంగా నడుస్తావు, భయాల్లేకుండా తింటావు. నువ్వు ఇంట్లో ఉన్నా, ప్రయాణంలో ఉన్నా నీకు ప్రశాంతత ఉంటుంది. అందుకే, నీ జీవితం చూసి అసూయపడాలి, నా లాంటి పాలకుడిని చూసి కాదు!"

ఆ మాటలు విని ఆ సామాన్య వ్యక్తి కళ్ళు తెరుచుకున్నాయి. తనకున్న దాని పట్ల అతను సంతృప్తి చెందాడు. తాను ఉన్న స్థితికి అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పి, ఆయనను స్తుతించాడు.

సుఖమంటే సంపద కాదు : చాలా మందికి, ఎక్కువ ఉంటే ఎక్కువ చింత, తక్కువ ఉంటే ఎక్కువ శాంతి, సౌఖ్యం లభిస్తాయి. బయటి మెరుపును నమ్మవద్దు ధనవంతులు, పలుకుబడి ఉన్నవారు జీవితాన్ని అనుభవిస్తున్నట్లు కనిపించినా, వారి వాస్తవం దానికి పూర్తి విరుద్ధంగా ఉండవచ్చు. కాబట్టి, మనకు దైవం ఇచ్చిన స్థితిని అంగీకరించి, సంతోషంగా జీవించాలి. ❖

# మానవత్వం, ధైర్యం ఐక్యతకు నిలువెత్తు నిదర్శనాలు

**మన చుట్టూ అన్యాయం, కష్టాలు, విపత్తులు ఉన్నప్పటికీ, తోటి మనిషి పట్ల ప్రేమ, కరుణ ఇంకా బతికే ఉన్నాయని నిరూపించ డానికి కొన్ని అద్భుతమైన సంఘటనలు జరుగుతుంటాయి. ఈ రెండు కథనాలు మానవత్వంలోని అపారమైన శక్తిని గుర్తుచేస్తున్నాయి.**

## మునిగిపోతున్న ప్రాణాన్ని నిలబెట్టిన ఫైసల్ సాహసం



ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్ జిల్లాలో జరిగిన ఈ ఘటన, క్షణం విలువను, తక్షణ స్పందన గొప్పతనాన్ని చాటి చెప్పింది. శుభమ్ తివారీ తన కారులో ప్రయాణిస్తున్నప్పుడు, ఒక చిన్నారిని రక్షించే ప్రయత్నంలో నియంత్రణ కోల్పోయి, ఎస్‌యూవీ కారుతో సహా చెరువులో పడిపోయారు. వాహనం వేగంగా నీటిలో కూరుకు పోసాగింది. లోపల తివారీ అపస్మారక స్థితిలో నిస్సహాయంగా ఉండిపోయారు. అదే సమయంలో, అక్కడే పడవలో ఉన్న ఫైసల్ ఈ ప్రమాదాన్ని చూశాడు. అతను ఒక్క క్షణం కూడా ఆలోచించ లేదు. తన ప్రాణాలకు ప్రమాదమని తెలిసినా, ధైర్యంతో వెంటనే నీటిలోకి దూకాడు. వాహనం బరువును, నీటి ఒత్తిడిని లెక్కచేయ కుండా, అపస్మారక స్థితిలో ఉన్న తివారీని చివరి క్షణంలో బయటకు లాగాడు. ఫైసల్ చేసిన ఈ సాహసం వల్లే తివారీ ప్రాణాలు దక్కాయి. ఫైసల్ చూపిన వీరోచిత మానవత్వం, ఏ మనిషైనా ఆపదలో ఉంటే వెనుకాడకూడదని మనకు స్పష్టమైన సందేశం ఇచ్చింది.



## కూల్చివేతలోనూ గెలిచిన ఐక్యత: శర్మా కుటుంబం అండ

ఒకవైపు కూల్చివేత, మరొకవైపు కలకాలం నిలిచే కరుణ. జమ్మూలో జర్నలిస్ట్ అర్షద్ దార్ ఇంటిని అకస్మాత్తుగా కూల్చివేయడంతో ఆయన కుటుంబం నిరాశ్రయులయ్యారు. అన్యాయం గెలిచిందనుకున్న ఆ నిస్సహాయ క్షణంలో...జమ్మూకు చెందిన ప్రేమ్ పాల్ శర్మ కుటుంబం ముందుకు వచ్చింది. ఎలాంటి మత, సామాజిక భేదం లేకుండా, కేవలం మానవత్వం దృష్టితో... హిందూ-ముస్లిం ఐక్యతకు అత్యున్నత ఉదాహరణగా నిలిచారు. వారు వెంటనే తమ సొంత ఆస్తిలో ఉన్న ఏడు మార్లాల స్థలాన్ని అర్షద్ కుటుంబానికి దానంగా ఇచ్చారు. అంతేకాకుండా, "నేను వారికి ఇల్లు కట్టిస్తాను" అని గొప్ప హామీని ఇచ్చారు. శర్మ కుటుంబం చేసిన ఈ పని, భవనం కూలిపోయినా, మనుషుల మధ్య విశ్వాసం, ప్రేమ, సామరస్యం అనే పునాదులు మాత్రం చెక్కుచెదరలేదని నిరూపించింది. మతాల మధ్య చిచ్చు పెట్టాలనుకునే శక్తులకు ఇది గట్టి సమాధానం.

### ఈ రెండు కథనాలను కలిపి చూస్తే ఒకే సత్యం బోధపడుతుంది:

మన జీవితంలో పెద్ద కష్టాలు ఎదురైనా, లేదా పక్క మనిషికి ఆపద వచ్చినా... మనకు అండగా నిలిచేది మనలోని మానవత్వం మాత్రమే. ఫైసల్ లాగా, ప్రమాదం ఎదురైనప్పుడు ఆలోచించకుండా, నిస్వార్థంగా సహాయం చేయడానికి మనసుండాలి. శర్మ కుటుంబం లాగా, ఇతరులు అన్యాయానికి గురైనప్పుడు, మతాలు, ప్రాంతాలు చూడకుండా సానుభూతితో అండగా నిలబడాలి. జర్నలిస్ట్ అర్షద్ దార్ ఇల్లు కోల్పోయినా మానవత్వాన్ని పొందాడు, శుభమ్ తివారీ ప్రాణాలనే తిరిగి పొందారు. వీరిద్దరినీ నిలబెట్టింది వేర్వేరు మతాలకు, ప్రాంతాలకు చెందిన వ్యక్తులే అయినా, వారికి స్ఫూర్తినిచ్చింది మాత్రం ఒకే ఒక్క మానవత్వం. మనం ఏ స్థితిలో ఉన్నా, మన చుట్టూ ఉన్న ప్రపంచంలో ఆశను నింపగలిగే శక్తి మనలోనే ఉంది.




**ఓ యువతా!** మీరు కేవలం భవిష్యత్తు వారసులు మాత్రమే కాదు, వర్తమానపు శక్తి! మీలో అంతులేని ఆవేశం, అద్భుతమైన శక్తి నిండి ఉన్నాయి. ఈ టీనేజ్ దశ అనేది కేవలం శారీరక ఎదుగుదల మాత్రమే కాదు, మీ ఆత్మపరివర్తన చెందే మహోన్నత ఘట్టం.

ప్రపంచం ఒకవైపు ఆధునిక ఆకర్షణలతో, మరోవైపు నిరంతర సామాజిక ఒత్తిళ్లతో మిమ్మల్ని చుట్టుముట్టేస్తుంది. "నేను ఎవరు?", "నా మార్గం ఏది?" అనే ప్రశ్నల మధ్య మీరు పోరాడుతుండవచ్చు. ఈ సుడిగుండంలో మీకు కావలసింది కేవలం నియమాలు కాదు, మీ హృదయాన్ని బలోపేతం చేసే, మీ ఆత్మకు మార్గనిర్దేశం చేసే ఒక దిక్సూచి.

## 1. విశ్వాసపు పునాది: మీ కవచం

"ప్రతి శిశువు స్వచ్ఛమైన ప్రకృతితో జన్మిస్తుంది." ఈ మాట ఎంత సత్యం! తల్లిదండ్రులుగా, మార్గదర్శకులుగా, మన చుట్టూ ఉన్న సమాజంగా మన పాత్ర కేవలం నియంత్రించడం కాదు, వారికి ప్రేమపూర్వకమైన ఆశ్రయాన్ని ఇవ్వడం.

➤ **ధైర్యమే దైవభక్తి:** ఇస్లామిక్ విలువలను కేవలం నియమాలుగా చూడకండి. అవి మీ జీవితంలో దయ, నిజాయితీ, సహనంగా ప్రదర్శించబడాలి. మీ ధార్మిక విశ్వాసమే ఈ ఆధునిక ప్రపంచపు వివక్ష , ఒత్తిళ్ల నుండి మిమ్మల్ని కాపాడే అత్యంత శక్తివంతమైన కవచం.

➤ **సంభాషణే వారధి** : మీ ఇంట్లో భయం ఉండకూడదు. మీ సందేహాలు, పోరాటాలను మీరు భయం లేకుండా పంచుకునే హృదయపూర్వకమైన సంభాషణకు తలుపులు తెరవండి. అల్లాహ్ మార్గానికి ఆహ్వానించినట్లుగా, జ్ఞానం మరియు దయగల సలహాతో మీ అంతరంగ పోరాటాలకు సమాధానం ఇవ్వండి.

➤ **గుర్తుంచుకోండి** : మీ తల్లిదండ్రులు మీ పట్ల చూపించే ప్రతి సహనం, మీ కోసం చేసే ప్రతి దుఆ (ప్రార్థన) ఒక ఉన్నతమైన ఆరాధన. వారి కోసం మనస్ఫూర్తిగా ప్రార్థించండి.

మీరు జీవితంలో అత్యంత అద్భుతమైన దశలో ఉన్నారు. అన్వేషణ, కలలు, అంతులేని శక్తితో నిండిన టీనేజ్ దశ! ప్రతి మలుపులోనూ కొత్త సవాళ్లు, ఆకర్షణలు మిమ్మల్ని పలకరిస్తాయి. ఈ ప్రపంచంలో ఎగిరే పక్షిలా స్వేచ్ఛగా, శక్తివంతంగా ఎదగడానికి, మీ భవిష్యత్తుకు బలమైన పునాది వేయడానికి ఇదే సరైన సమయం.

మీరు ఎంతటి ఉజ్వలమైన భవిష్యత్తును సృష్టించుకోగలరో మీకు తెలుసా? కేవలం స్కూల్ మార్కులే కాదు, మీ గుండెలో నిజమైన ధైర్యం, మీ మాటలో విశ్వసనీయత, మీ ప్రవర్తనలో దైవభక్తి మిమ్మల్ని అల్లాహ్ దృష్టిలో ప్రత్యేకమైనవారిగా నిలబెడతాయి.

## విజయానికి 10 బంగారు లక్ష్యాలు

మీ జీవితంలో మీరు సాధించాల్సిన 10 కీలకమైన లక్ష్యాలు ఇవి:

### 1. నిజాయితీ: మీ కిరీటం

ఒక్క అబద్ధం వెయ్యి అబద్ధాలకు దారి తీస్తుంది. నిజం చెప్పాలని నిర్ణయించుకుంటే, మీ హృదయం తేలికపడుతుంది, మీరు పాపాలకు దూరంగా ఉంటారు. సత్యమే మిమ్మల్ని స్వర్గానికి చేరుస్తుంది. అల్లాహ్ దృష్టిలో 'సత్యవంతులు'గా లిఖించబడటం కంటే గొప్ప గౌరవం ఏముంది?

### 2. విశ్వసనీయత: మీ బలం

ప్రవక్త (స) శత్రువుల నుండి కూడా అల్-అమీన్ (విశ్వసనీయుడు) అనే బిరుదు పొందారు. మీరు నమ్మదగినవారుగా ఉంటేనే గౌరవం దక్కుతుంది. నమ్మకస్తులైతే, జీవితంలో ఏ మోసానికి గురి కారు.

### 3. తల్లిదండ్రులు: మీ స్వర్గం

వారి మార్గదర్శకత్వం కంటే గొప్ప సలహా మరొకటి లేదు. వారి పట్ల కృతజ్ఞత చూపండి.

"నాకు కృతజ్ఞుడవై ఉండు, నీ తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపు. నా వైపునకే నీవు మరలి రావలసి ఉన్నది." (ఖురాన్ 31:14)

### 4. ఓర్పు: మీ మనసును గెలవండి

కోరికలు, ఆకర్షణలు ఉప్పొంగే ఈ సమయంలో ఆత్మనిగ్రహం పాటించండి. ఒక్క క్షణం ఓర్పు వహించి, అల్లాహ్ కొరకు మిమ్మల్ని మీరు అదుపు చేసుకోగలిగితే, మీరు గొప్ప లక్షణాన్ని సాధించినట్టే.

### 5. దృష్టి కేంద్రీకరణ: మీ ప్రార్థనే మార్గం

ఏకాగ్రత లోపాన్ని అధిగమించడానికి ఒక రహస్యం ఉంది: మీ నమాజ్ పై పూర్తి దృష్టి పెట్టండి. అల్లాహ్ ముందు ఏకాగ్రతతో నిలబడితే, అదే ఏకాగ్రతను మీ చదువులలోనూ, పనులలోనూ కొనసాగించగలుగుతారు.

### 6. దృఢ నిశ్చయం: మీ విజయం

మీ లక్ష్యం పట్ల స్పష్టత, దృఢత్వం ఉంటేనే మీరు విజయాన్ని సాధించగలరు. మంచి కార్యాన్ని చేపట్టడానికి, కష్టాలలో ఓర్పు వహించడానికి ఈ నిశ్చయమే అవసరం.

### 7. మౌనం: పనికిరాని మాటలకు దూరం

సినిమాలు, పాటలు, అనవసరమైన గాసిప్‌లు... ఈ నిష్ప్రయోజనమైన మాటలు మీ ఏకాగ్రతను దెబ్బతీస్తాయి. మౌనంగా ఉండటం నేర్చుకోండి. నిష్ప్రయోజనమైన మాటలు అల్లాహ్ మార్గం నుండి తప్పుదోవ పట్టిస్తాయి.

### 8. లౌకిక ఆకర్షణ: జాగ్రత్త!

ఈ ప్రపంచం శాశ్వతం కాదు. లౌకిక జీవితం మిమ్మల్ని మోసగించనివ్వకండి. ఆవగింజంత తప్పు చేసినా, అల్లాహ్ దానిని తీర్పు రోజున లెక్కలోకి తీసుకుంటాడు. అల్లాహ్ ఆజ్ఞలను పాటిస్తూ, యవ్వన కోరికలను నియంత్రించుకున్న యువతకు తీర్పు రోజున అల్లాహ్ నీడ లభిస్తుంది.

### 9. సమయం, డబ్బు: వృథా చేయవద్దు

మీ సమయం అత్యంత విలువైనది. టీవీ, సంగీతం, అనవసరమైన ఖర్చులు... అన్నీ వృథా కిందకే వస్తాయి. సమయాన్ని ఉత్పాదకతతో, అల్లాహ్ పట్ల విధేయతతో ఉపయోగించండి. అల్లాహ్ హద్దులు మీరేవారిని ప్రేమించడు.

### 10. దైవభక్తి : మీ ఉత్తమ దుస్తులు

పైన చెప్పిన అన్ని లక్షణాలకూ మూలం దైవభక్తి (తఖ్వా). మీరు ప్రతి క్షణం అల్లాహ్ మిమ్మల్ని చూస్తున్నాడని భయపడితే, మిగతా మంచి లక్షణాలు మీలోకి సహజంగా వస్తాయి. "భయభక్తులు అనే దుస్తులే మంచి దుస్తులు" (7:26)

### అద్భుతమైన ప్రయాణం మీదే

ప్రియమైన యువ మిత్రులారా, ఈ లక్ష్యాలు కేవలం జాబితా కాదు. ఇవి మీ అద్భుతమైన ప్రయాణానికి పునాది. మీకు లభించిన ఈ యవ్వనాన్ని అల్లాహ్ అప్పగింతగా భావించండి.

మీరు ఈ లోకంలో ఎదురులేని శక్తిగా మారడానికి, అంతిమంగా అల్లాహ్ వద్ద విజయాన్ని సాధించడానికి... విశ్వాసం, స్థిరత్వం, దైవభక్తి అనే ఈ మూడు స్తంభాలపై మీ జీవితాన్ని నిర్మించండి.

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
గీటురాయి
వారపత్రిక




**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

## వినయం: వ్యక్తిత్వానికి మూలం

వినయం- విజయం పుట్టుకతో వచ్చేవి కావు. వయసుతో పాటు, విద్య, సంస్కారం వల్ల అలవడేదే వినయం. కష్టించి పనిచేసి, లక్ష్యాలు సాధించడం ద్వారా లభించేది విజయం. మర్యాద, మంచి నడవడిక, వినయం ఎల్లప్పుడూ  కలిసి ఉంటాయి. ఇవి సాధారణంగా ఇంటి వాతావరణం నుంచే సంక్రమిస్తాయి. ఒక వ్యక్తి ఎదుగుదల అనేది అతని వినయానికి, విజయానికి ఒక చిహ్నంగా నిలవాలి. అప్పుడే పదిమంది మీ నీడ కింద సేద తీరతారు.

“నిన్ను అనుసరిస్తున్న విశ్వాసుల పట్ల దయార్ద్రహృదయంతో, వినయంగా మసలుకో.” (అష్-షుఅరా: 215)

విజయం సాధించామని అహం ప్రదర్శించకూడదు. మనుషులతో మమేకం కావాలి. ‘నువ్వు-నేను’ అనే అడ్డుగోడ ఉన్నంత వరకు మానవ సంబంధాలు ఎదగవు.

## విజయం - అహంకారాల మధ్య తేడా

మనిషి ఉన్నతికి, పతనానికి వినయం, విజయం, అహంకారం అనే మూడు అంశాలు ప్రధాన హేతువులు. అనుకున్నది సాధించినప్పుడు కలిగే అపరిమితమైన ఆనందం, ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుంది. ఎదుగుదలకు మార్గం సుగమం చేస్తుంది. మనిషి చేసే ప్రతి పని ఈ విజయం కోసమే.

❖ విజయాన్ని అణకువతో స్వీకరిస్తే, అది యోగంగా మారుతుంది.

❖ అదే విజయాన్ని అహంకరిస్తే, అది పతనాన్ని శాసిస్తుంది.

వినయం కలిగినవారు ‘విజయం-అహంకారాల’ చక్రబంధంలో చిక్కుకోరు. విజయ గర్వం ప్రమాదం, కానీ విజయ వినయం ప్రమోదం  (శ్రేయస్సు).

ఉదాహరణకు : మక్కా విజయం సందర్భంగా మహనీయ ముహమ్మద్ (సల్లం) గారు ఒంటె మూపురానికి తన నుదురు ఆనుతున్నంత వినయ స్థితిలో మక్కాలో ప్రవేశించారు.

ఆయన(స) ఇలా అన్నారు: “పరస్పరం అణకువతో వ్యవహ

రించమని, ఎవరూ ఎవరిమీదా గొప్పలు చెప్పుకోకూడదని, ఎవరూ ఎవరి మీదా అత్యాచారానికి పాల్పడకూడదని దేవుడు నన్ను వహీ ద్వారా ఆదేశించాడు.'' (సహీహ్ ముస్లిం)

కులగోత్రాలు, సిరిసంపదల ప్రాతిపదికపై ఇతరులను నీచంగా భావించటం లేదా అన్యాయానికి ఒడిగట్టడం సమంజసం కాదు. దేవుడు గొప్ప స్థానం ప్రసాదించినప్పుడు, కృతజ్ఞత తెలుపుకోవాలి గాని, సాటి మానవులను అల్పులుగా భావించకూడదు.

''భూమిపై నిక్కుతూ, నీల్గుతూ నడవకండి. (ఈ అహం కారంతో) మీరు భూమిని చీల్చి వేయలేరు. పర్వతాల ఎత్తుకు ఎదగనూ లేరు.'' (బనీ ఇస్రాయీల్: 37)

గర్వం, అహంకారం ఒక దుర్గంధభరిత దుర్గుణం. మనిషి వద్ద ఏవి ఉన్నా, ఈ ఒక్క దుర్లక్షణం అతని జీవితాన్ని దుర్భరం చేస్తుంది. వినయం ఉంటే విజయమే, లేకుంటే విలయమే!

## విజయానికి సరైన గుర్తులు

ఒక సందర్భంలో, గుర్రంపై ఉన్న వ్యక్తి (ఆ దేశపు రాజు) బండరాయిని తొలగించడానికి ప్రయాస పడుతున్న సైనికుల వద్దకు వెళ్లి వారికి చేయూత అందించారు. వారి నాయకుడు ఆజ్ఞలు మాత్రమే ఇస్తూ నిలబడ్డాడు. రాజు గుర్రం ఎక్కి వెళ్తూ నాయకుడితో, ''ఈసారి నీ కింద పనిచేసే సైనికులకు సహాయం కావాలంటే ఈ దేశపు రాజుకు కబురు పంపు'' అని చెప్పారు. ఈ కథనం, వినయం బలహీనత కాదు, విజ్ఞత అని నిరూపిస్తుంది.

గొప్ప వ్యక్తుల జీవితాల్లో వినయం ఎలా ఉందో చూద్దాం:

❖ **ప్రవక్త ముహమ్మద్(స)** : ఆయన తన సహాబాలలో ఒకరిగా కూర్చునేవారు. అపరిచితులకు ఆయన్ను గుర్తించడం కష్టమయ్యేది. బోధన సమయంలోనూ, ఒక సాధారణ బాటసారి సందేహం అడిగినప్పుడు, తన ప్రసంగాన్ని ఆపి, అతని దగ్గరికి వచ్చి, వినయంగా కూర్చొని బోధించారు.

❖ **అబూ బకర్ సిద్దీక్ (ర)** : ఖలీఫా అయిన తర్వాత కూడా, తన స్వభావం మారదని, ముందులాగే ప్రజల గొర్రెలకు పాలు పితుకుతానని చెప్పారు.

❖ **ఉమర్ ఫారూక్ (ర)** : ప్రయాణంలో నీటి ప్రవాహం దాటుతుండగా, తన పాదరక్షలు భుజంపై పెట్టుకుని, ఒంటె కాడిని పట్టుకొని నడిచారు. ఇస్లాం ద్వారా అల్లాహ్ ఇచ్చిన గౌరవం కాక, వేరే మార్గంలో గౌరవాన్ని ఆశిస్తే పరాభవం తప్పదని స్పష్టం చేశారు.

❖ **ఉస్మాన్ (ర)** : ఖలీఫా అయినప్పటికీ మస్జిదులో సాధారణ చాపపై పడుకునేవారు. అలాగే తన సేవకుడిని కూడా సవారీపై వెనుక కూర్చోబెట్టుకొని వెళ్లారు.

❖ **ఉమర్ ఇబ్ను అబ్దుల్ అజీజ్ (రహ్మ)** : దీపం ఆరిపోయి నప్పుడు, ముఖ్యులు ఉన్నప్పటికీ, తానే లేచి వెలిగించారు. తాను 'అల్లాహ్ ఖలీఫాను' అని పిలిచినప్పుడు, ఆ స్థాయిలో తాను లేనని, తన పేరు లేదా 'అమీరుల్ ముమినీన్' అని పిలవాలని వినయంగా చెప్పారు.

''ఒక చెంబు తెలివితేటల కన్నా, ఒక ఔన్సు వినయం విలువ అధికం.'' సామర్థ్యం ముఖ్యమే కానీ, వినయం, విధేయత లేని సామర్థ్యానికి గుర్తింపు ఉండదు.

## ఓటమిలో సహనం, నేర్చుకునే గుణం

భూమ్మీద గెలుపు సాధించిన వారి కన్నా ఓటమిని పొందిన వారు ఎక్కువ. గెలుపు పొందినవాడు కూడా ముందు ఓటమి రుచి చూసి ఉంటాడు. ఓటమిలో ఉండే బాధను విజయానికి తొలిమెట్టుగా భావించాలి. ఆ బాధకు పట్టుదల తోడైతే గెలుపు సాధ్యమవుతుంది.

''(విశ్వాసులారా!) బాధపడకండి. అధైర్యంతో క్రుంగిపోకండి. మీరు నిజమైన విశ్వాసులైతే చివరికి మీరే విజయం సాధిస్తారు.'' (ఆలి ఇమ్రాన్: 139)

ఓటమి బాధతో ఆగిపోతే ఎప్పటికీ విజయాన్ని రుచి చూడలేము. ఓడిన ప్రతిసారీ గెలవాలనే తాపత్రయమే మనిషిని ముందుకు నడిపిస్తుంది. జీవితంలో ఓడినవాడు గెలవడానికి ఒక్కోసారి జీవితమంతా సరిపోదు. అందుకే కార్యాన్ని ప్రారంభించిన ప్రతి ఒక్కరూ గెలవాలనే ఆరంభించాలి.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

### ఓటమిని అధిగమించి గెలుపు దిశగా పయనించే మార్గాలు:

❖ ఓటమిని అంగీకరించాలి: ఓటమికి దోహదం చేసిన కారణాలను అన్వేషించాలి.

❖ అనుభవాన్ని గుర్తించాలి: విజయం సాధించలేని ప్రయత్నం విలువైన అనుభవాన్ని ఇస్తుంది. ఓటమి బాధ నుంచి బయటపడటానికి, చేసిన కష్టాన్ని గుర్తు చేసుకోవాలి.

❖ కారణాల విశ్లేషణ: ఓటమికి దారి తీసిన కారణాలను విశ్లేషించుకుని, మళ్లీ ఆ తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి ఓటమీ ఒక బలమైన పాఠాన్ని నేర్పుతుంది.

❖ శారీరక, మానసిక ఆరోగ్యం : ఓటమి బాధతో మానసికంగా కుంగిపోకుండా, నమాజు, మంచి పుస్తక పఠనం, వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

❖ సమస్యలను చర్చించాలి : ఒంటరిగా ఉండకుండా, మిత్రులు లేదా అనుభవజ్ఞులతో చర్చించి పరిష్కారం కోసం ప్రయత్నించాలి. సహనంతో కూడిన నైపుణ్యం సత్ఫలితాలను ఇస్తుంది.

❖ చిన్న లక్ష్యాలు: స్వీయ నమ్మకాన్ని కోల్పోకుండా చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి.

### గుర్తుంచుకోవాల్సిన సత్యాలు:

❖ ప్రయత్నం ముఖ్యం: అల్లాహ్ మనల్ని ప్రయత్నం చేయమంటున్నాడే కానీ, విజయమే ముఖ్యమని చెప్పలేదు.

❖ ప్రతికూల ఆలోచనలు వద్దు: "నాకు అదృష్టం లేదు", "నాకు బిడియం" వంటి ప్రతికూల ఆలోచనలు మనల్ని వెనక్కి నెట్టేస్తాయి.

❖ ఆత్మవిశ్వాసం, ఆత్మాభిమానం: ఆత్మవిశ్వాసం ఉంటే విజయం దక్కకపోయినా, సవాళ్ళను అధిగమించగలం అనే నమ్మకం పెరుగుతుంది. ఆత్మాభిమానం ఉంటే సంపద లేకపోయినా అందరిలో గౌరవం పెరుగుతుంది.

"విశ్వాసులారా! సహనం వహించి, ప్రార్థనచేస్తూ (మా) సహాయం అర్థిస్తూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ సహనం వహించేవారికి తోడుగా ఉంటాడు." (అల్-బఖర: 153)

### వినయమే విజయ రహస్యం

విజయంలో వినయం, ఓటమిలో సహనమే విజయానికి రాచబాట. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండటం నేర్పుతుంది. "నిరాడంబరం కన్నా గొప్పదేమీ లేదు. గొప్పదనమెప్పుడూ నిరాడంబరంగానే ఉంటుంది."

జీవితంలో సుఖం మాత్రమే ఉండదు, కష్టాలు ఉంటేనే సుఖం విలువ తెలుస్తుంది. ఊరకనే విజయం రాదు, దానికి వెల చెల్లించాలి. వినయం, సహనాలే విజయానికి సోపానాలని బలంగా నమ్మి నడుచుకుంటే, విజయం మీ పాదాక్రాంతం అవుతుంది.

యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# నేల-మార్గదర్శకత్వం: మనిషి హృదయాలు మూడు రకాలు



- మేరాజుద్దీన్

**మన పెద్దలు** జ్ఞానాన్ని జీవితానికి మూలమైన నేలతో పోల్చారు. వర్షం భూమికి జీవాన్ని ఇచ్చినట్లే, జ్ఞానం మనిషి హృదయానికి జీవాన్ని ఇస్తుంది. వర్షం పడినప్పుడు, భూమిలోని నేల రకాలను బట్టి అది వివిధ రకాలుగా స్పందించినట్లే, అల్లాహ్ యొక్క మార్గదర్శకత్వం హృదయ రకాన్ని బట్టి మూడు విధాలుగా స్వీకరించబడుతుంది.

### ఆ మూడు రకాల నేలలు (హృదయాలు), వాటి ప్రవృత్తి :

### 1. సారవంతమైన నేల (నిర్మలమైన హృదయం)

**నేల లక్షణం :** ఈ నేల చాలా సారవంతంగా ఉంటుంది. ఇది కురిసిన వర్షపు నీటిని పూర్తిగా పీల్చుకుని, సమృద్ధిగా వృక్షసంపదను, పచ్చని గడ్డిని మొలకెత్తిస్తుంది. ఆ విధంగా, అది తనకూ, పర్యావరణానికీ మేలు చేస్తుంది.

**మానవ ఉపమానం :** ఇది ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, తెలివైన హృదయం గల వ్యక్తికి ఉదాహరణ. ఇతను అల్లాహ్ ధర్మాన్ని, ప్రవక్త బోధనలను ఆసక్తిగా స్వీకరించి, నేర్చుకుంటాడు. ఆ జ్ఞానాన్ని తాను ఆచరించడమే కాకుండా, ఇతరులకు కూడా బోధించి, సమాజానికి మేలు చేస్తాడు. ఇటువంటి వారు ప్రవక్తల వారసులు.

### 2. గట్టి నేల లేదా రిజర్వాయర్ (జ్ఞానాన్ని నిల్వ చేసే హృదయం)

**నేల లక్షణం :** ఈ నేల కఠినంగా ఉన్నప్పటికీ, వర్షపు నీటిని లోపలికి పీల్చుకోకుండా, దానిని నిల్వ ఉంచుతుంది (రిజర్వాయర్ లాగా). దీని వలన ప్రజలు ఆ నీటిని త్రాగడానికి, తమ పశువుల దాహం తీర్చడానికి, పొలాలకు నీరు పెట్టడానికి ఉపయోగించుకుంటారు.

**మానవ ఉపమానం :** ఇది జ్ఞానాన్ని భద్రపరిచే హృదయం గల వ్యక్తికి ఉదాహరణ. ఇతను ప్రవక్త బోధనలను ఖచ్చితంగా నేర్చుకుని, దానిని ఇతరులకు ఏ మాత్రం మార్చకుండా, యథాతథంగా అందిస్తాడు. వీరు తమ జ్ఞానంతో స్వయంగా తీర్మానాలు చేయలేకపోయినా, ఆ జ్ఞానాన్ని ఇతరులకు చేరవేసి, వారు ప్రయోజనం పొందేందుకు సహాయపడతారు.

### 3. నిస్సారమైన నేల (మొండి హృదయం)

**నేల లక్షణం :** ఈ నేల నిస్సారమైనది. ఇది నీటిని పీల్చుకోలేదు, నిల్వ ఉంచుకోలేదు, వృక్షసంపదను మొలకెత్తించనూ లేదు. ఎంత వర్షం పడ్డా, అది ఏమాత్రం ప్రయోజనం ఇవ్వదు.

**మానవ ఉపమానం :** ఇది అల్లాహ్ యొక్క మార్గదర్శకత్వాన్ని ఏ మాత్రం అంగీకరించని హృదయం గల వ్యక్తికి ఉదాహరణ. ఇతను జ్ఞానాన్ని, వివేకాన్ని స్వీకరించడానికి నిరాకరిస్తాడు. ఆ విధంగా, అతనికి స్వయంగా ప్రయోజనం ఉండదు, ఇతరులకు ప్రయోజనం చేకూర్చే మార్గమూ ఉండదు.

### ఆత్మ పరిశీలన

జ్ఞానం అనే వర్షం అందరిపై ఒకే విధంగా కురుస్తున్నప్పటికీ, మన హృదయం ఏ రకానికి చెందుతుందనే దానిపైనే మనం పొందే ప్రయోజనం ఆధారపడి ఉంటుంది. మనం సారవంత మైన భూమిలాగా మారి, జ్ఞానాన్ని స్వీకరించి, ఆచరించి, ఇతరులకు పంచి, ఫలాలను అందించాలని కోరుకోవాలి.

### ప్రార్థన (దుఆ)

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చేసినట్లుగా మనం ఇలా ప్రార్థిద్దాం:

(ఓ అల్లాహ్, హృదయాలను మార్చేవాడా, మా హృదయాలను నీ విధేయత వైపు తిప్పు.)

(ఓ హృదయాలను మార్చేవాడా, నా హృదయాన్ని నీ దీన్ (ధర్మం)పై స్థిరంగా ఉంచు.) ఆమీన్.

**కథ** - **షేఖ్ అబ్దుల్ బాసిత్, కొత్తగూడెం**



# మంచి పొరుగు

**ఒక రోజు** ఉదయం ఆ ఇంట పండుగ వాతావరణం. "ఏంటి! ఈ రోజు సార్ గారు చాలా సంతోషంగా కనిపిస్తున్నారు?" అని ఆ ఇల్లాలి ప్రశ్న. "మనం ఎన్నో రోజులుగా కంటున్న కల నెరవేరే రోజు వచ్చేసింది," అని ఆ గృహ యజమాని ఉద్వేగంతో పలికారు. అది కేవలం ఒక కల కాదు, ఎన్నో ఏళ్ల కోరిక- ఉమ్రా యాత్రకు వెళ్ళాలనే పవిత్ర సంకల్పం! ఆ రోజు కోసం కూడబెట్టుకున్న నాలుగు లక్షల రూపాయలు, దైవ సన్నిధికి చేరుకోబోతున్న ఆనందం... అంతా సిద్ధమైంది. సంతోషంగా ఆ ధనాన్ని ఇల్లాలి చేతిలో పెట్టి, ఏదో పని మీద బయటకు వెళ్లారు.

★★★

రాత్రిపూట, ఆందోళన నిండిన భార్య గొంతు ఫోన్‌లో వినిపించింది: "హలో. ఏమండీ ఎక్కడ ఉన్నారు? వెంటనే మీరు ఆసుపత్రికి రండి." జరిగింది ఏమిటంటే- పక్కింటి అబ్బాయి, చదువుల్లో చురుకైన ఆ కుర్రాడికి యాక్సిడెంట్ జరిగింది. పరిస్థితి విషమం. తక్షణమే ఆపరేషన్ చేయాలి. ఖర్చు- సరిగ్గా నాలుగు లక్షలు! వారి నిస్సహాయ పరిస్థితి ఆ ఇల్లాలికి తెలుసు.

ఆ క్షణం, ఉమ్రా యాత్రకు వెళ్లాలనే వ్యక్తిగత కల, ఎదురింటి ప్రాణాన్ని కాపాడాల్సిన మానవీయ బాధ్యత ముందు చిన్నదైపోయింది. ఆలోచన లేదు, సంశయం లేదు. "నువ్వు ఒక పని చెయ్యి. ఉదయం నేను ఇచ్చిన డబ్బులు కట్టేయ్" అని ఆ పెద్దాయన ఆదేశించారు.

"అదే చేశాను, అండీ," అని ఆమె పలికినప్పుడు, వారిరువురి హృదయాలు పుణ్యకార్యాన్ని సాధించాయి.

### పొరుగు ధర్మమే... విశ్వాసం!

ఆ పైవాడి దయ వల్ల, సరైన సమయానికి అందిన వైద్యం వల్ల ఆ పిల్లాడు బ్రతికాడు, కోలుకున్నాడు. ఆ కుర్రాడు తన తెలివితేటలతో చదువు పూర్తి చేసి, క్యాంపస్ ఇంటర్వ్యూలో ఓ పెద్ద కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు.

కొంత కాలానికి, తన మొదటి నెల జీతం తీసుకొని, వారి ఇంటి తలుపు తట్టాడు. "లేదు అంకుల్, మీరు ఆ రోజు నా ప్రాణాలు కాపాడారు. లేకపోతే నేను ఏమైపోయే వాడినో," అంటూ కృతజ్ఞతాభావంతో తన మొదటి సంపాదనను వారికి అందించబోయాడు.

అప్పుడు ఆ పెద్దాయన పలికిన మాటలు, ఈ సమాజానికి ఒక సందేశం. "అబ్బే, అదేం లేదు. ఒక పొరుగువారిగా మా బాధ్యత నెరవేర్చాం అంతే."

అప్పుడే అక్కడికి వచ్చిన ఆ పిల్లాడి తల్లిదండ్రులు, వారి అసలు సంకల్పాన్ని బయటపెట్టారు. "అన్నయ్య, మీరు మక్కా యాత్రకు వెళ్ళాలని దాచుకున్న డబ్బులతో వాడి ప్రాణాలు కాపాడారు. ఆ రోజే వాడు నిర్ణయించుకున్నాడు... నా మొదటి జీతంతోనే మీకు ఉమ్రా చేయించాలి అని."

ఆ మాటలు విని ఆ ఇంటి యజమాని కళ్ళు చెమర్చాయి. "ఎలాంటి బంధుత్వ సంబంధం లేకున్నా, ఒకే మతం కాకున్నా, కేవలం పొరుగువారు అన్న భావంతో మమ్మల్ని ఆదుకున్నారు," అని ఆ పిల్లాడి తండ్రి చెప్పినప్పుడు, నిజమైన మానవత్వం, మతాలు- ప్రాంతాలకు అతీతమైన సౌభ్రాతృత్వం అక్కడ నిలబడి నవ్వుతోంది.

ఆ పిల్లాడి తల్లి, ఆ పెద్దాయన భార్యతో "మా వాడి మొదటి సంపాదనతో మీలాంటి మంచి మనుషుల పవిత్ర యాత్ర జరగాలి అని నేను కూడా మొక్కుకున్న," అంది.

### ప్రవక్త సందేశం

ఈ సందర్భంలోనే ఆ పెద్దాయన చెప్పిన మాటలు ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మహత్తర సందేశాన్ని గుర్తు చేస్తాయి:

"పొరుగువారు ఆకలితో ఉన్నప్పుడు, మీరు కడుపారా తింటే మీరు విశ్వాసులే కారు."

అందుకే, ఆ కుటుంబం చేసిన సాయం కేవలం ధర్మం కాదు, అది అత్యున్నతమైన 'విశ్వాసానికి' నిదర్శనం.

మొదటి జీతం పంపిణీతో నోరు తీపి చేసుకోబోతున్న ఆ రెండు కుటుంబాలను చూసి, మనసులోంచి వచ్చిన మాట ఇదే: "మీలాంటి మంచి పొరుగువారిని ప్రసాదించిన ఆ పైవాడికి ధన్యవాదాలు."

దైవం ప్రతి పొరుగువారు ఇలాగే కలిసి మెలిసి, ఒకరి కష్టాల్లో మరొకరు అండగా నిలబడి, ఒకరి హక్కులు మరొకరు నెరవేర్చగలిగే కరుణను ప్రసాదించు గాక. అమీన్!

## మానవత్వానికి పిలుపు : మృత్యువు అంచున ఉన్న ఏడుగురి ప్రాణాలను కాపాడిన ఇమామ్ తక్షణ స్పందన!



చీకటి ఇంకా పూర్తిగా వీడని తెల్లవారుజాము సమయం. గాఢ నిశ్శబ్దం అలుముకున్న ఆ వేళ, తెల్లవారుజామున 4:00 గంటల ప్రాంతంలో అస్సాంలోని శ్రీభూమి జిల్లాలో ఊహించని విపత్తు సంభవించింది. నీలాంబజార్ ప్రాంతంలో జాతీయ రహదారిపై నుంచి పక్కకు దూసుకెళ్లిన ఒక కారు వేగంగా సమీపంలోని రిజర్వాయర్ నీటిలో మునిగిపోవడం ప్రారంభించింది.

ఆ సమయంలో, కేవలం ఆరాధన కేంద్రంగా ఉండే మస్జిదు, మనిషికి మనిషి ఆసరాగా నిలిచే మానవత్వ కేంద్రంగా మారింది.

పెద్ద శబ్దం వినగానే, ఆ ప్రాంత మస్జిదు ఇమామ్ అబ్దుల్ బాసిత్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఆయన మస్జిద్ వెలుపలికి పరుగెత్తుకు వచ్చి చూడగా, తలుపులు, కిటికీలు బిగించిన కారు ఒకటి క్షణాల్లో నీట మునిగిపోతున్న దృశ్యం కనిపించింది. ఆ కారు లోపల ఏడుగురు ప్రయాణీకులు మృత్యువు అంచున కొట్టుమిట్టాడుతు న్నారు.

### ప్రార్థన కాదు, ప్రాణాల రక్షణే ముఖ్యమన్న తక్షణ నిర్ణయం

ఆ సమయంలో ఆలస్యం చేయకుండా, ఇమామ్ బాసిత్ తన మస్జిద్ లౌడ్ స్పీకర్‌ను ఆయుధంగా మార్చారు. అది అజాన్‌కు (ప్రార్థనకు) పిలుపు కాదు, అది సహాయం కోసం, మానవత్వాన్ని మేల్కొల్పడం కోసం చేసిన ఆర్తనాదం. బాసిత్ గట్టిగా చేసిన ఈ పిలుపు ఆ ప్రాంత స్థానికుల హృదయాలను తాకింది. నిద్రమత్తును పక్కనపెట్టి, స్థానికులంతా తక్షణమే సంఘటనా స్థలానికి పరుగెత్తుకు వచ్చారు.

ఆ ఒక్క పిలుపుతో సంఘీభావం, ఐకమత్యం అద్భుతంగా పని చేసింది. స్థానికుల సహాయంతో ఆ ఏడుగురు ప్రయాణీకులను సురక్షితంగా బయటకు తీయగలిగారు.

అబ్దుల్ బాసిత్ అసాధారణమైన ధైర్యం, తక్షణ స్పందన కారణంగా ఏడు నిండు ప్రాణాలు సురక్షితంగా ఒడ్డుకు చేరాయి. ఒక ఇమామ్ కేవలం తన మతపరమైన కర్తవ్యాన్ని మాత్రమే కాకుండా, మానవతా దృక్పథాన్ని కూడా ప్రదర్శించి, ఆపదలో ఉన్న వారిని కాపాడిన ఈ సంఘటన సమాజానికి గొప్ప స్ఫూర్తినిచ్చింది. మతం, ప్రాంతం వేరైనా, మనిషిని ఆదుకోవాలనే పవిత్రమైన ఆలోచనకు ఆయన నిదర్శనంగా నిలిచారు.



# ఉత్తమ బోధకుని లక్షణాలు

నసీరా బేగం

**మానవుడు** సహజంగా సంఘజీవి. నిత్యం ఇతరుల నుంచి నేర్చుకుంటూ, ఇతరులకు నేర్పుతూ ఉంటాడు. ఈ పరస్పర బోధన కేవలం మాటలకే పరిమితం కాదు, మన జీవితంలోని ప్రతి రంగంలోనూ, ప్రతి చర్యలోనూ అప్రయత్నంగా సాగుతూ ఉంటుంది. అయితే, సృష్టికర్త కొందరికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించడం వల్ల వారు బోధనా వృత్తిని చేపట్టవలసి ఉంటుంది. వీరు గురువులు, మతపెద్దలు, తల్లిదండ్రులు లేదా మరే ఇతర బాధ్యుని రూపంలోనైనా ఉండవచ్చు. ఈ బోధనా బాధ్యత అత్యంత కష్టంతో కూడుకున్నది, అయినప్పటికీ పవిత్రమైనది. దీనిని కష్టపడి, ఓపికతో నిర్వర్తిస్తే, అది మూడు పూలు, ఆరు కాయలుగా వికసించి, ఇహపర లోకాలలోనూ గొప్ప ప్రతిఫలాన్ని స్తుంది.

## ఉత్తమ బోధకునికి ఉండవలసిన లక్షణాలు

### 1. చిత్తశుద్ధి (నిష్కపటమైన సంకల్పం)

బోధకుడు తన హృదయంలో పరిపూర్ణమైన చిత్తశుద్ధిని కలిగి ఉండాలి. ఇతరులకు బోధించేటప్పుడు, “నేను ఎదుటివారిలోని చెడును రూపుమాపి, వారిలో మంచిని పెంపొందించదలుచుకున్నాను” అనే దృఢ సంకల్పం అవసరం. ఈ చిత్తశుద్ధియే బోధించే విషయానికి మరింత బలాన్ని, పటిష్టతను చేకూరుస్తుంది.

దైవప్రవక్త (స) సెలవిచ్చినట్లు: “మీరు చేసే ప్రతి కార్యంలో చిత్తశుద్ధి, దైవ సంతోషానికి విలువ ఇవ్వనంత వరకు ఆ కార్యం దైవామోదానికి నోచుకోదు.” (అబూదావూద్) నిష్కపటమైన ఉద్దేశం లేని ఏ కార్యాన్నీ దేవుడు అంగీకరించడు.

### 2. దైవభీతి (దైవం పట్ల భయం, గౌరవం)

మనుషులు చేసే ప్రతి పని దైవభయంతో ముడిపడి ఉంటేనే అది చక్కగా రాణిస్తుంది. దైవభీతితో కూడిన బోధన అత్యంత విలువైనది, లోతైన బాధతో కూడుకున్నది. ‘నేను చెప్పిన మంచిని ఇతను పాటించకపోతే, ఇహపరలోకాలలో నష్టపోతాడు కదా! అతన్ని ఈ నష్టం నుంచి ఎలా కాపాడగలను?’ అనే తపన బోధకునిలో ఉండాలి.

ఇంకా, బోధకుడు తనలోని దైవభయాన్ని శిష్యులలోనూ కలిగించడానికి శతవిధాలా ప్రయత్నించాలి. ఎందుకంటే, అల్లాహ్

(దైవం) దృష్టిలో దైవభయం కలవాడే అందరికంటే ఉత్తముడు. దైవప్రవక్త (స) స్వర్గంలోకి ముందుగా ప్రవేశించడానికి కావలసిన సుగుణాలుగా దైవభీతి, ఉత్తమ నడవడికలను పేర్కొన్నారు. (తిర్మిజీ)

### 3. జ్ఞానం (లోతైన అవగాహన)

బోధకుడు సత్యాసత్యాలు, ధర్మాధర్మాలు, దైవాగ్రహాన్ని కలిగించే, దైవసంతోషాన్ని పెంచే కార్యాలపై సమగ్రమైన జ్ఞానాన్ని విద్య ద్వారా పొందాలి. అతను ఎల్లప్పుడూ నిత్య విద్యార్థిగా నేర్చు కుంటూనే ఉండాలి. అప్పుడే వివేకంతో, దృఢంగా మాట్లాడ గలడు. బోధకుని జ్ఞానం తవ్వేకొద్దీ పొంగిపొరలే గనుల మాదిరిగా ఉండాలి. దీనికోసం నిరంతరం కృషి చేయాలి. జ్ఞానం లేని బోధకుడు నీరు లేని బావిగా, నూనె లేని దీపంగా మారిపోతాడు.

### 4. వివేకం, మృదుత్వం (యుక్తి, సౌమ్యత)

బోధకుడు వివేకం, మృదుత్వం అనే రెండు ఆయుధాలతోనే ఎదుటివారిని లోబరుచుకోగలడు. రోగిలోని బలహీనతను గుర్తించి చికిత్స చేసే డాక్టర్‌లా, బోధకుడు ముందుగా శిష్యుని బలహీనతలను తెలుసుకోవాలి.

బోధకుడు సందర్భాన్ని బట్టి కొద్దిపాటి కోపాన్ని ప్రదర్శించినా, అంతిమంగా సౌమ్యతనే కలిగి ఉండాలి. ఎందుకంటే దేవుడు స్వయంగా మానవుల పట్ల మృదుత్వాన్ని కలిగి ఉన్నాడు, మృదుత్వాన్నే ఇష్టపడతాడు. మృదుత్వం మనిషిని తొందరపాటు, ఆగ్రహాలకు గురికాకుండా కాపాడుతుంది.

దైవప్రవక్త (స) ఉపదేశం: "ప్రజలను కష్టానికి గురిచేయకండి. వారికి తేలికగా విషయాలను బోధించండి. వారిని సంతోషంగా ఉండనివ్వండి. శత్రుత్వాన్ని బోధించకండి." (బుఖారీ)- అంటే, బోధకుడు అత్యంత వివేకంతో, సమయానుకూలంగా, క్లుప్తంగా, మధురంగా, పనికొచ్చే విషయాలనే బోధించాలి.

### 5. బాధ్యత పట్ల స్పృహ (పరలోకంలో జవాబుదారీతనం)

'తన బాధ్యతలపై పరలోకంలో దేవునికి సమాధానం ఇవ్వవలసి ఉందనే' భావన బోధకునిలో బలంగా నాటుకుని ఉండాలి. ఈ భావనే అతనిని ప్రేరేపించి, శిష్యులలోనూ అదే స్పృహను కలిగించాలని కోరుకునేలా చేస్తుంది.

జీవితం, దాని లక్ష్యం గురించి, దేవుడు అనుగ్రహించిన వరాలను సరైన రీతిలో వినియోగించుకోకపోతే కలిగే దైవాగ్రహం గురించి బోధించడం మౌలిక కర్తవ్యం. ఈ విషయాన్ని మరచిపోయి ఇతర విషయాలన్నీ నేర్పితే, అది బూడిదలో పోసిన పన్నీరు మాదిరిగా వృధా అయిపోతుంది.

### 6. విశ్వాసం గురించి అవగాహన (ఏకదైవారాధన పటిష్టత)

బోధకుడు శిష్యుల విశ్వాసాన్ని లోపం లేకుండా పటిష్టపరచాలి. దేవుడు ఒక్కడే, ఆయన తప్ప మరొక దేవుడు లేడు అనే సత్యాన్ని కరాఖండిగా చెప్పాలి. ఈ విశ్వాసమే ఆచరణల భవనానికి పునాది రాయి.

ప్రాపంచిక విషయాలలో ఎంత ఉన్నతంగా ఎదిగినా, విశ్వాసం బలహీనంగా ఉంటే కృషి అంతా వృధా. విశ్వాసం పటిష్టంగా ఉండి, ప్రాపంచిక విషయాలలోనూ ఎదిగితే, అతనికి లాభాలే తప్ప నష్టం ఉండదు. దైవారాధనలతో వారిని అనుసంధానించడం, వారి స్థోమతకు తగ్గ ఉత్తమ ఆచరణలను పరిచయం చేయడం ముఖ్యం.

### 7. స్నేహితుల గురించి తెలుసుకోవడం (పరిసరాల ప్రభావం)

మనిషి తన స్నేహితుల ద్వారానే అధిక విషయాలు నేర్చుకుంటాడు. స్నేహితులను బట్టే వ్యక్తిత్వం అంచనా వేయబడుతుంది. అందుకే, మంచి స్నేహితులను ఎన్నుకునేలా వారిని ప్రోత్సహించాలి. ఒకవేళ చెడ్డవారితో ఉంటే, వారి నుంచి నేర్చుకోవడం కాదు, వారికే మంచిని నేర్పేవానిగా మారాలని బోధించాలి.

మంచి చేయమని, మంచినే బోధించమని, చెడును విడనాడమని నిరంతరం నేర్పాలి. అలాగే, శరీర దృఢత్వాన్ని కాపాడుకోవాలని, ఆరోగ్యవంతమైన అలవాట్లతో జీవించాలని కూడా బోధించాలి.

### 8. దుఆ (ప్రార్థన)

మనిషి తనవంతు కృషి అంతా చేస్తాడు, కానీ దైవామోదం లభిస్తేనే ఆ కార్యం నెరవేరుతుంది. అందుకే, బోధకుడు తన శిష్యుల కోసం ప్రార్థన (దుఆ) చేయాలి. శిష్యులు కూడా ఏకైక దేవుడైన అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండాలి.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




## ఊపిరి తీసుకోనివ్వని కాలుష్యం

ఢిల్లీలో 2022-2024 మధ్య కాలంలో రెండు లక్షలకు పైగా తీవ్ర శ్వాసకోశ వ్యాధులు (ARI) నమోదయ్యాయని కేంద్ర ప్రభుత్వం స్వయంగా ధృవీకరించడం, మన శ్వాస వ్యవస్థపై కాలుష్యం విధ్వంసాన్ని స్పష్టం చేస్తోంది. ఆసుపత్రిలో చేరికలు పెరుగుతున్న ఈ ఆరోగ్య సంక్షోభానికి, పట్టణ ప్రాంతాలలో క్షీణిస్తున్న వాయు నాణ్యత ఒక ప్రధాన "ట్రిగ్గరింగ్ ఫ్యాక్టర్"అని ప్రభుత్వం అంగీకరించింది. ఈ గణాంకాలు కేవలం సంఖ్యలు కావు, ఇది శుభ్రమైన గాలి కోసం ప్రతి పౌరుడి హక్కును కాలరాస్తున్న జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితికి బలమైన సాక్ష్యం. ఇకనైనా ప్రభుత్వం కేవలం నిఘా వ్యవస్థలను విస్తరించకుండా, కాలుష్య నియంత్రణపై యుద్ధ ప్రాతిపదికన, కఠినమైన చర్యలు తీసుకోవాలి. లేకపోతే, భారతీయులు తమ ఊపిరితిత్తులను ప్రమాదంలో పడేస్తూ జీవించాల్సిన దుస్థితి తప్పదు.

## దేశంలో చలి తీవ్రత ఎక్కువే: డిసెంబర్ 3 నుంచి కొన్ని ప్రాంతాల్లో శీతల గాలులు- ఐఎండీ అంచనా

భారత వాతావరణ విభాగం (IMD) విడుదల చేసిన తాజా అంచనాల ప్రకారం, డిసెంబర్ 2025 నుంచి ఫిబ్రవరి 2026 వరకు రాబోయే మూడు నెలల శీతాకాలంలో చలి తీవ్రత ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా, మధ్య భారతదేశం, వాయవ్య ప్రాంతాలు, దక్షిణ భారతదేశంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని, అయితే పశ్చిమ హిమాలయ ప్రాంతం, ఈశాన్య రాష్ట్రాలు వంటి చోట్ల సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉండొచ్చని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. అంతే కాకుండా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, హరియాణా, పంజాబ్, మహారాష్ట్రల్లో శీతల గాలుల ప్రభావం సాధారణం కంటే నాలుగైదు రోజులు అదనంగా ఉండే అవకాశం ఉందని, అలాగే ఈ నెల డిసెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు మధ్య, వాయవ్య ప్రాంతాల్లో శీతల గాలులు వీస్తాయని ఐఎండీ హెచ్చరించింది.

## వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపునకు సుప్రీం నిరాకరణ

వక్ఫ్ ఆస్తిగా రికార్డుల్లో నమోదు కానప్పటికీ ఏళ్ల తరబడి మతపరమైన కార్యక్రమాలకు ఉపయోగపడుతున్న కారణంగా వక్ఫ్ ఆస్తిగా పరిగణిస్తూ వచ్చిన 'వక్ఫ్ బై యూజర్' ఆస్తులతో పాటు ఇతర వక్ఫ్ ఆస్తులన్నింటినీ 'ఉమీద్' పోర్టల్ ద్వారా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకునే గడువును పొడిగించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇప్పటికే ఇచ్చిన గడువు ముగిసేలోగా పిటిషనర్లు సంబంధిత ట్రిబ్యునళ్లను ఆశ్రయించి సమస్యను పరిష్కరించుకోవాలని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. 'సెక్షన్ 3బీని మా దృష్టికి తెచ్చారు. అయితే దరఖాస్తుదారుల సమస్యకు ట్రిబ్యునళ్ల సమక్షంలో పరిష్కారం ఉంది. 6 నెలల గడువుకు ముందు ట్రిబ్యునళ్లను ఆశ్రయించి పరిష్కారం కోరే స్వేచ్ఛను పిటిషనర్లకు ఇస్తున్నాం. ఇందుకు సంబంధించి మా వద్దకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ పక్కనబెడుతున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు గడువును పొడిగించాలని కోరుతూ ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, ఏఐఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. వక్ఫ్ ఆస్తుల్ని రిజిస్టరు చేయడానికి ప్రభుత్వం విధించిన 6 నెలల గడువు పూర్తి కావచ్చిందని ఒక న్యాయవాది తెలిపారు.

## చరిత్రలోనే తొలిసారిగా కుప్పకూలిన రూపాయి

భారత రూపాయి విలువ అమెరికా డాలర్‌తో పోలిస్తే 90.16కి పడిపోయింది. రూపాయి తొలిసారిగా 90 స్థాయిని దాటడం మార్కెట్‌లో ఆందోళన కలిగించడమే కాకుండా.. రాబోయే నెలల్లో ఆర్థిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉందనే సంకేతాన్ని స్పష్టంగా చూపిస్తోంది. ఈ పతనం భారత కరెన్సీపై కొత్త ఒత్తిడిని సూచిస్తుండగా.. దిగుమతి ఖర్చులు, ఇంధన ధరలు, విదేశీ విద్య, ప్రయాణాల వంటి అనేక రంగాల్లో ప్రభావం తక్షణమే కనిపించనుంది. ఈ సంవత్సరం భారత రూపాయి అమెరికా డాలర్‌తో పోలిస్తే దాదాపు ఐదు శాతం క్షీణించింది. ఆసియాలో అత్యంత దారుణంగా మారిన కరెన్సీలలో ఒకటిగా రూపాయి నిలవడానికి ప్రధాన కారణాలు ఏంటంటే.. రికార్డు స్థాయికి పెరిగిన వాణిజ్య లోటు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ, అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం ముగియడంలో జాప్యంతో పాటుగా బలమైన అమెరికా డాలర్. భారత విదేశీ వాణిజ్యంలో దిగుమతులు, ముఖ్యంగా బంగారం, వెండి, భారీగా పెరుగుతుండగా, ఎగుమతి పనితీరు తగ్గుముఖం పట్టడం వలన వాణిజ్య లోటు 41.68 బిలియన్ డాలర్లకు విస్తరించింది. ఈ లోటును సమకూర్చడానికి మరిన్ని డాలర్లు అవసరం కావడం రూపాయి విలువపై మరింత ఒత్తిడిని పెంచుతోంది.

## గాజాలో అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన - ప్రపంచం మౌనం దేనికి?

నూతన ఆశలతో ప్రపంచం 2025కు స్వాగతం పలికినప్పటికీ, గాజా మాత్రం అత్యంత విధ్వంసకర, ప్రాణాంతక ఏడాదిని ఎదుర్కొందన్న చేదు నిజాన్ని 12 ఇస్రాయీలీ మానవ హక్కుల సంస్థల సంయుక్త నివేదిక వెల్లడించింది. ఇస్రాయీల్ వైమానిక దాడుల కారణంగా 20,000 మందికి పైగా పిల్లలతో సహా మరణించిన వారి సంఖ్య 67,173కు చేరుకోగా, గాయపడిన వారి సంఖ్య 1.7 లక్షలు దాటింది. అంతేకాక, గాజా జనాభాలో దాదాపు 90 శాతం (1.9 మిలియన్లు) నిరాశ్రయులయ్యారు. ఇస్రాయీల్ సృష్టించిన ఆకలి కారణంగా 157 మంది చిన్నారులతో సహా 461 మంది అమాయక పౌరులు మరణించడం, మౌలిక సదుపాయాలన్నీ పూర్తిగా ధ్వంసమవడం అంతర్జాతీయ మానవతా చట్టాలను నిర్లక్ష్యం చేయడాన్ని సూచిస్తోంది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో సెటిలర్ల హింస, జైళ్లలో 98 మంది పాలస్తీనియన్ల కస్టడీ మరణాలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఇస్రాయీల్ అంతర్జాతీయ చట్టాలను క్రమపద్ధతిలో ఉల్లంఘిస్తున్న తరుణంలో, ఈ భయంకరమైన విధ్వంసం, ఆకలి మరియు మానవ హక్కుల ఉల్లంఘనలను ఆపడానికి అంతర్జాతీయ సమాజం తక్షణమే శక్తివంతంగా జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఆర్థిక సంక్షోభాన్ని తగ్గించడానికి పాలస్తీనా అథారిటీకి సౌదీ అరేబియా 90 మిలియన్ డాలర్లు బదిలీ

పాలస్తీనా అథారిటీ (PA) ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని తగ్గించడానికి సౌదీ అరేబియా కింగ్‌డమ్ 90 మిలియన్ అమెరికన్ డాలర్లను బదిలీ చేసింది. 2025 సంవత్సరానికి కింగ్‌డమ్ తరపున కొనసాగుతున్న ఆర్థిక మద్దతులో భాగంగా ఈ నిధులు అందాయి. ఇస్రాయీల్ ప్రభుత్వం క్లియరెన్స్ రాబడులను నిలిపివేయడంతో PA జీతాల కోతలు, పెరుగుతున్న ద్రవ్య పరమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న సమయంలో ఈ సాయం అందించడం గమనార్హం. సౌదీ రాయబారి ప్రిన్స్ మన్సౌర్ బిన్ ఖలీద్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ గ్రాంట్ పాలస్తీనా ప్రజల ఆరోగ్యం, విద్య వంటి కీలక రంగాలకు మద్దతు ఇవ్వడానికి, వారి దృఢత్వాన్ని బలోపేతం చేయడానికి ఉద్దేశించబడింది. పాలస్తీనా అథారిటీ తరపున మంత్రి ఎస్తేఫాన్ సలామెహ్, రియాద్ అందించిన ఈ కీలకమైన ఆర్థిక మరియు రాజకీయ మద్దతుకు తమ ప్రగాఢ కృతజ్ఞతను వ్యక్తం చేశారు.

## ప్రపంచ టాప్ 10 వంటకాలలో హైదరాబాద్ బిర్యానీ

ప్రపంచవ్యాప్తంగా బియ్యం ఆధారిత వంటకాలపై ప్రసిద్ధి చెందిన TasteAtlas తాజాగా విడుదల చేసిన టాప్ 50 బెస్ట్ రైస్ డిషెస్ జాబితాలో హైదరాబాద్ బిర్యానీకి ప్రత్యేక స్థానం లభించింది. భారతదేశం నుండి ఈ జాబితాలో చోటుదక్కిన ఏకైక వంటకం ఇదే కావడం విశేషం. హైదరాబాద్ బిర్యానీ నేరుగా టాప్ 10లో 10వ స్థానాన్ని సాధించడం ఇంకా దాని ప్రాముఖ్యాన్ని తెలుపుతుంది. ఈ జాబితాలో జపాన్ అత్యధిక వంటకాలతో నిలిచింది. అందులో ప్రముఖమైన Negitoro Don వంటకం ప్రపంచంలో నంబర్ 1 బెస్ట్ రైస్ డిష్‌గా గుర్తింపు పొందింది. ఫ్యాటీ మిన్స్డ్ ట్యూనా (టోరో), కట్ చేసిన నెగి ఉల్లిపాయలు, వెచ్చని జపాన్ రైస్ పై సర్వ్ చేయడం దీని ప్రత్యేకత. అదేవిధంగా ఒటోరో నిగిరి సుషి, మాకి, అజి నిగిరి సుషి వంటి అనేక జపనీస్ వంటకాలు కూడా జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

## మానవాళికి పెనుసవాలుగా మారిన ఒబేసిటీ

ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయెసస్ ప్రకటన ప్రకారం, స్థూలకాయం అనేది మన కాలపు అత్యంత తీవ్రమైన ప్రజారోగ్య సవాళ్లలో ఒకటిగా మారింది, ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది ఈ దీర్ఘకాలిక వ్యాధితో జీవిస్తున్నారు. 2030 నాటికి ఈ సంఖ్య రెట్టింపు అవుతుందని అంచనా. గుండె జబ్బులు, మధుమేహం మరియు క్యాన్సర్‌కు దారితీస్తూ, స్థూలకాయం 2024 లో 3.7 మిలియన్ల మరణాలకు కారణమైందని, ఇది ఆరోగ్య వ్యవస్థలపై తీవ్ర ఒత్తిడి కలిగిస్తోందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో, WHO కొత్తగా GLP-1s (గ్లూకాగాన్-లైక్ పెప్టైడ్-1 రిసెప్టర్ అగోనిస్ట్‌లు) మందులను పెద్దలలో స్థూలకాయం చికిత్స కోసం సిఫార్సు చేస్తూ మార్గదర్శకాలను విడుదల చేసింది, ఇది మిలియన్ల మందికి ఆశను కల్పిస్తోంది. అయినప్పటికీ, స్థూలకాయం సంక్లిష్టమైనదని, కేవలం మందుల ద్వారా మాత్రమే కాకుండా, బలమైన విధానాల ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాలను సృష్టించడం, ముందస్తు స్క్రీనింగ్ ద్వారా అధిక ప్రమాదం ఉన్నవారిని రక్షించడం, జీవితకాలం వ్యక్తి-కేంద్రీకృత సంరక్షణ అందించడం అనే మూడు స్తంభాలపై నిర్మించిన సమగ్ర వ్యూహం ద్వారా మాత్రమే ఈ సంక్షోభాన్ని పరిష్కరించగలమని ఘెబ్రేయెసస్ నొక్కి చెప్పారు.

# దాతృగుణం కన్నా ఉత్తమమైనది త్యాగభావం

**- ముహమ్మద్ వహీదుద్దీన్**

**ధనవంతుడికి దాతృత్వం ఒక విధి.** పిసినారితనం ఒక మహా పాపం. అల్లాహ్ దృష్టిలో అత్యంత అసహ్యకరమైన గుణాలు రెండే: పిసినారితనం, దుర్నీతి.

మహాప్రవక్త ముహమ్మద్(స) ఈ రెండు స్వభావాల పర్యవసానాలను ఒక అద్భుతమైన ఉపమానంతో వివరించారు:

**దానం :** స్వర్గానికి చెందిన ఓ మహావృక్షం. దాని కొమ్మలు విశ్వమంతటా విస్తరించి ఉన్నాయి. ధర్మదాత ఆ కొమ్మల్లో ఒకదాన్ని పట్టుకుంటాడు, అది అతన్ని స్వర్గానికి చేరుస్తుంది.

**పిసినారితనం :** నరకానికి చెందిన వృక్షం. దాని శాఖలు కూడా ఇహలోకంలో అన్ని వైపులా అల్లుకొని ఉన్నాయి. పిసినారి ఏదో ఒక శాఖను పట్టుకుంటాడు, అది అతన్ని నేరుగా నరకానికి చేరుస్తుంది.

## దాత, పిసినారి : స్వర్గానికి, నరకానికి మధ్య

దాతృ స్వభావం కలవాడు దైవానికి, ప్రజలకు దగ్గరవుతాడు, స్వర్గానికి చేరువగా ఉంటాడు, నరకానికి దూరంగా ఉంటాడు. అద్భుతమేమంటే, దాత, అల్లాహ్‌కు అత్యంత ప్రియమైనవాడు.

**దాతృత్వంతో జీవించేవాడు:** ధర్మదాత తన సంపదను దైవం ప్రసాదించినదిగా భావిస్తాడు. అతని మనసులో నిరంతరం దైవస్మరణే ఉంటుంది. అందుకే అతను విరివిగా, చిత్తశుద్ధితో సహాయం చేస్తాడు. ప్రజలు ఎటువంటి భయం, మొహమాటం లేకుండా అతన్ని ఆశ్రయిస్తారు, తమ కష్టాలను పంచుకుంటారు. ఈ నిస్వార్థ అనుబంధం సభ్య సమాజంలో అంతరాలను చెరిపివేస్తుంది. అతని జీవితం భూమిపైనే స్వర్గంగా మారుతుంది. అతని మనసు శాంతితో, సంతృప్తితో కుదుటపడుతుంది.

## పిసినారితనంతో కునారిల్లేవాడు:

పిసినారికి దైవధ్యాస తక్కువ. అతను ప్రజలకు దూరమై ఏకాకిగా ఉంటాడు. అతని ధనం ఎవరికీ ఉపకరించదు కాబట్టి, ఎవరూ అతన్ని ఇష్టపడరు. ఫలితంగా, అతని మనసు అసంతృప్తితో, దుఃఖంతో నిండిపోతుంది. అతనికి శాంతి లభించకపోగా, మనోవ్యథ ఎక్కువైపోతుంది. ఈ మనోవేదనే నరకయాతన కన్నా తక్కువేమీ కాదు. దాతృత్వపు ఆనందం ఎంత గొప్పదో చెప్పడానికి, హజ్రత్ అలీ (రజియల్లాహు అన్హు) గారి ఉదంతం ఒక నిదర్శనం. వారం రోజులుగా తన ఇంటికి ఒక్క అతిథి కూడా రాలేదని ఆయన విలపించారు- అదృష్టం పంచుకోలేక పోయాననే ఆవేదన అది.

## త్యాగం: దాతృత్వం కన్నా ఉన్నత శిఖరం

దాతృత్వం గొప్పదే అయినా, దాని కన్నా ఉన్నతమైన శిఖరం త్యాగభావానిది.

**దాత :** తన అవసరం తీరిన తర్వాత, మిగిలిన దానిలోంచి ఇతరులకు ఇస్తాడు.

**త్యాగమయుడు :** తనకు అత్యవసరంగా అవసరం ఉన్న వస్తువును కూడా పక్కనపెట్టి, దానిని ఇతరుల కోసం త్యాగం చేస్తాడు.

త్యాగం అనేది గొప్ప పుణ్యకార్యాలలోకెల్లా గొప్పది. మదీనా నగరంలోని అన్సార్ల (సహాయకులు)లో ఈ సద్గుణం పరాకాష్ఠకు చేరింది. వారు పేదరికంలో ఉన్నప్పటికీ, మక్కా నుండి వలస వచ్చిన ముహాజిర్లకు తమ స్వంత స్వప్రయోజనాల కన్నా ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి, తమ అవసరాలను కూడా త్యాగం చేసి వారిని ఆదుకున్నారు. ఈ అత్యున్నత గుణం కారణంగా అల్లాహ్ వారిని ఎంతగానో ప్రశంసించాడు.

## మహాప్రవక్త ముహమ్మద్ (స) దయార్ద్ర హృదయం:

మహాప్రవక్త (స) ప్రజలందరికన్నా అత్యధికంగా దానం చేసేవారు. ఆయన స్వయంగా పేదరికపు జీవితాన్ని గడిపేవారు, కానీ ఆయన దానధర్మాలు చక్రవర్తులనే సిగ్గుపడేలా చేసేవి. ఆయన ప్రకటించినట్లుగా: "ఏ వ్యక్తి అయితే తనకు అవసరం ఉండి కూడా ఒక వస్తువును ఇతరులకు ఇచ్చేస్తాడో, అతని అపరాధాలను అల్లాహ్ మన్నిస్తాడు."

ఒకసారి, ఎంతో అవసరమైన సమయంలో ఒక మహిళ ఆయనకు దుప్పటిని బహూకరించింది. ఆయన దాన్ని కప్పుకున్న వెంటనే, ఒక వ్యక్తి వచ్చి దాన్ని అడగగా, ఏమాత్రం ఆలోచించకుండా ఆ దుప్పటిని ఆయన వారికి ఇచ్చివేశారు.

అందుకే దాతృత్వం ఒక సద్గుణం కావచ్చు, కానీ త్యాగమే మనిషిని దైవానికి దగ్గర చేసే ఉత్తమోత్తమ మార్గం.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**